

ది కిల్లర్ ఫ్రం సిజబి
MVS
PUBLICATIONS
మధుబాబు

# దీ కిల్లర్ ఫ్రం సి.ఐ.బి.

*సిగరెట్ పొగ గుండెలనిండా పీల్చుకొని, ముడుచుకు కూర్చున్నాడు ప్రీత్‌పాల్ సింగ్. చలిగాలి దారుణంగా వీస్తోంది. వర్షం కురిసే సూచనలు కూడా కనిపిస్తున్నాయి.*

ఆకాశంవంక చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు. సిగరెట్ ని నోటిలో పెట్టుకోబోతుండగా–దూరంలో చిన్న సవ్వడి వినిపించింది.

ఉలిక్కిపడి సిగరెట్‌ని బూటుకాలికింద పెట్టి ఆర్పేశాడు. నిశ్శబ్దంగా లేచి మోకాళ్ళమీద పాకుతూ ముందుకు జరిగాడు. అతను కూర్చునివున్న ప్రదేశానికి వంద గజాల దూరంలోవుంది నదీతీరం. నదిలోని చేపలు కదలాడినా, ఆశబ్దం అతనికి వినిపిస్తుంది.

నదీ తీరంలో వున్న పొదలను చేతులతో పక్కకు తోస్తూ ముందుకుపోయాడు ప్రీత్‌పాల్. నక్షత్రాల వెలుగును ప్రతిఫలింపచేస్తున్న నీటిని చూడగానే ఒక పొదచాటున ఆగిపోయాడు.

అంతకముందు వినిపించిన శబ్దం. మరింత దగ్గిరలో వినవచ్చింది. ఊపిరిబిగపట్టి, కనులు చిట్లించి అటు చూశాడతను.

రెండు నిముషాల తరువాత ఒక చిన్న డింగీ అతని దృష్టిపథంలోకి వచ్చింది.

పదిమంది వ్యక్తులు వున్నారా డింగీలో. నలుగురు తెడ్లు వేస్తున్నారు. మిగిలినవారు పెద్ద పెద్ద రైఫిల్స్ పట్టుకొని నదీ తీరాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో మరికొంచెం ముందుకు జరిగి కూర్చున్నాడు ప్రీత్‌పాల్ సింగ్.

నదీ ప్రవాహం మధ్య ప్రయాణిస్తున్నది డింగీ. ఉన్నట్లుండి పక్కకు తిరిగింది. సరాసరివచ్చి ప్రీత్‌పాల్ కూర్చునివున్న చోటుకు పదిఅడుగుల దూరంలో వడ్డును చేరుకున్నది.

డింగీలో నుంచి ఎగిరి వడ్డుమీదికి దూకారు నలుగురు వ్యక్తులు. లంగరు త్రాటిని వడ్డుమీదవున్న ఒక బండరాతికేసి ముడివేశారు.

డింగీచివర కూర్చొని వున్నాడొక భారీమనిషి. రైఫిల్ ని

కిందపెట్టి ఎడమ చేతికివున్న వాచి వంక చూసుకున్నాడు అసహనంగా.

"పన్నెండు గంటలకల్లా రమ్మనిచెప్పి... ఏమిటిది?" అన్నాడు బొంగురుగొంతుతో.

ప్రీత్‌పాల్ రక్తం వేడిగా , వాడిగా ప్రవహించసాగింది. ఏదో తెలియని ఎక్సైట్ మెంట్ అతని అవయవాలను కంపింపచేయసాగింది.

"మనం వచ్చింది యిప్పుడేగదా! యింకో పదినిముషాలు వెయిట్ చేసి చూద్దాం.... ఈ ప్రాంతాల్లో మనల్ని గమనించే వారెవరూ లేరు. మనకొచ్చిన ప్రమాదం ఏమీలేదు." బొంగురు గొంతు వ్యక్తి మాటలకు వడ్డుమీద నిలబడినవారిలో ఒకతను సమాధానం యిచ్చాడు.

పదినిముషాల సేపు నదిచేస్తున్న చిరుమ్రోతలు తప్ప మరెటువంటి శబ్దాలు వినిపించలేదా ప్రదేశంలో.

డింగీలో కూర్చునివున్న వ్యక్తి అసహనంగా అటుయిటు కదిలాడు. చిన్నగాదగ్గి తుపుక్కున నీటిలో వుమ్మేశాడు.

ప్రీత్‌పాల్ సింగ్ కూర్చునివున్న పొదకు ఎడమవైపున

అడుగుల శబ్దం వినవచ్చింది. "వస్తున్నారు ... సిద్ధంగా వుండండి!" వడ్డుమీద వున్నవారిలో ఒకవ్యక్తి హెచ్చరించాడు.

ప్రీత్‌పాల్ సింగ్ గుండెలు వేగంగా కొట్టుకోవటం ప్రారంభించాయి. పెదిమలు ఎండిపోయాయి. పదిహేనురోజులనుంచీ ఆ చిట్టడివిలో మాటువేసివున్నాడతను. పదిహేనురోజులు !!

రాత్రి పగలు విసుగూ విరామం లేకుండా.... సరిగ్గా నిద్రకూడా పోకుండా. ఆనదిని కాపుకాశాడు. ఆఖరికి ఆశ్రమ ఫలించింది. ఎందుకోసం అక్కడికి వచ్చాడో... అది చూశాడు... ఇక నెమ్మదిగావెనుదిరగటమే మిగిలివుంది.

"పీటర్స్!!" నిశబ్దాన్ని చీల్చుకుంటూ వినవచ్చిందొక కంఠం. పొదలచాటునుంచి పదిఆకారాలు... నది వడ్డుకు వచ్చాయి. ఎనిమిదిమంది స్త్రీలు, ఇద్దరు పురుషులు.

ఆడవారిచేతులు వెనక్కి విరిచి కట్టబడివున్నాయి. అరిచి గోలచేయకుండా నోళ్ళలో గుడ్డలు కుక్కారు.

"ఇకనుంచీ మనం చాలా జాగ్రత్తగా వుండాలి పీటర్స్!మనం వీళ్ళని అరేబియా చేరుస్తున్నట్లు సి.ఐ.డిలు

పసికట్టారు. పాంజిమ్ కొండదారులన్నీ జాగ్రత్తగా పెట్రోలు చేస్తున్నారు. బాస్ తో చెప్పండి... ఇకనుంచీ నెలకు పాతికమంది కంటే ఎక్కువ సప్లయి చేయలేం..."

డింగీలో వున్న వ్యక్తితో అంటున్నాడు ఆడవారిని వెంటబెట్టుకు వచ్చిన మనిషి. వడ్డుమీద నిలబడిన నలుగురు ఆ స్త్రీలను బలవంతంగా డింగీలోకి ఎక్కిస్తున్నారు.

ప్రీత్‌పాల్ ఆవేశంతో వణికిపోయాడు. ఆడవారిని పట్టి బంధించి అరేబియా దేశాలకు బానిసలుగా ఎగుమతి చేస్తున్నారని పుకార్లు పుట్టాయి. ఇన్వెస్టిగేషన్ మొదలు పెట్టింది సి.ఐ.డి. శాఖ ఇంతవరకూ సరయిన ఆధారాలు దొరకలేదు. ఇప్పుడు దొరికాయి.

చల్లగా వెనుతిరిగి పై అధికారులకు రిపోర్టు చేయటంకంటే తను చేయగలిగింది ఏమీలేదని ప్రీత్‌పాల్ కి తెలుసు. ఆనిర్భాగ్యురాళ్ళను కాపాడటం అసంభవం. రైఫిల్స్ పట్టుకొని నిలబడిన దుర్మార్గులను ఎదిరించి ప్రయోజనం లేదు.

నెమ్మదిగా వెనక్కి జరిగాడు. బుస్సుమని

భయంకరమైన శబ్దం వినిపించి, అతని శరీరం జలదరించింది.

మెల్లిగా తలతిప్పి వెనక్కి చూశాడు.

పగడవిప్పి ఆడుతున్నదొక నాగుపాము... ప్రీత్‌పాల్ బూటుకాలు దానికి అడుగుదూరంలో వున్నది.

ప్రీత్‌పాల్ శరీరంలోని రక్తం గడ్డకట్టుకుపోయింది. భయం అతని నరనరాలకు వ్యాపించటం ప్రారంభించింది.

ప్రాణాలు పోతాయనికాదు... నాగుపాము కాటువేసినంత మాత్రాన ముంచుకుపోయిందేమీలేదు. కాని అది బుసకొట్టటం ప్రారంభించిందంటే. పక్కనే వున్న రాక్షసులకు వినిపిస్తుంది. ఏమిటో చూడటానికి వస్తారు. ఆపాదకేసి పరీక్షగా పదిక్షణాలు చూస్తేచాలు తను కనిపిస్తాడు.

వణుకుతున్న చేతిని ముందుకు జాచాడు ప్రీత్‌పాల్ ... పామును చంపటానికి కాదు, పట్టుకోవడానికి. పట్టుచిక్కకపోతే కాటు వేయించుకోవటానికి, కాటువేసిన తరువాత అది పారిపోతుందన్న ఆశతో.

మెరుపులా తల వెనక్కు లాగుకున్నది నాగుపాము.

భయంకరంగా బుసకొట్టి తలవిసిరింది. ఎంత బిగపట్టుకున్నా ఆ క్షణంలో ప్రీత్‌పాల్ నిబ్బరం దిగజారిపోయింది. అప్రయత్నంగా. తనకుతెలియకుండానే చేతిని వెనక్కు లాక్కున్నాడు.

నేలను కాటుఅందుకుంది నాగుపాము. దాని ఆవేశం తారాపథానికి చేరుకున్నది. క్రోధంతో మరింత భీకరంగా బుసలు కొట్టింది.

"ఏమిటది? ఏమిటా శబ్దం?" ఉన్నట్లుండి వినిపించిందొక కంఠం.

ప్రీత్‌పాల్ ఖంగారు పడిపోయాడు. పాము కంటే వేగంగా కదిలింది అతనిచేయి. రెప్పపాటు కాలంలో పాముతలను వడిసి పట్టుకుంది.

"మైగాడ్! మనిషి!! మనల్ని కనిపెట్టటానికి వచ్చిన సి.ఐ.డి.!!"పెద్దగా వినిపించిందొక అరుపు.

గిరుక్కున వెనుతిరిగాడు ప్రీత్‌పాల్. చేతిలో చుట్టలు చుట్టుకుపోతున్న పామును ఆకంఠం వినిపించిన దిశకు విసిరి పరుగు అందుకున్నాడు.

"పారిపోతున్నాడు... పట్టుకోండి...

పట్టుకోండి...."అన్న కేకలు ఆ నిశబ్ధవీధిలో మార్మోగాయి.

పది టార్చిలైట్లు ప్రీత్‌పాల్ మీదికి తమకాంతుల్ని ప్రసరింపచేశాయి. ధన్ మని పేలాయి నాలుగు రైఫిళ్ళు.

ఎగిరి మూడు అడుగులు ముందుకుపోయి పడ్డాడు ప్రీత్‌పాల్. మూడుబుల్లెట్లు అతని భుజాలకు రాచుకుంటూ పోయాయి. ఒకటి తలమీద పెద్ద గాటు పెట్టింది.

వెచ్చటి రక్తం అతని ముఖాన్ని తడపటం మొదలుపెట్టింది. అక్కడే వుంటే వాళ్ళు వచ్చి చంపేస్తారని అతనికి తెలుసు. తను పారిపోగలిగితే ఆడవాళ్ళను ఎగుమతిచేసే ఆధారుణ వ్యాపారానికి ఫుల్ స్టాప్ పడినట్లే.

జారిపోతున్న శక్తి సామర్ధ్యాలను కూడగట్టుకుని లేచి నిలబడ్డాడు. కళ్ళు తిరుగుతున్నాయి. వళ్ళుతూలిపోతున్నది. అలాగే నాలుగు అడుగులు ముందుకు వేశాడు.

పిడుగుపాటులా వెనుకనుంచి వచ్చిందొక దెబ్బ. ప్రీత్‌పాల్ సింగ్ కళ్ళముందు నక్షత్రాలు మెరిశాయి. మొదలునరికిన చెట్టులా ముందుకు పడిపోయాడు.

## 2

చల్లటి నీరు ముఖం మీద పడేసరికి కళ్ళు తెరిచాడు ప్రీత్‌పాల్ సింగ్. చుట్టూవున్నవారినిచూసి కళ్ళు చిట్లించాడు.

"వెల్ మై ఫ్రెండ్! ఇంత రాత్రివేళ యీ చిట్టడవిలో పొదల చాటున చేరి ఏంచేస్తున్నావో కాస్త చెపుతావా!" మృదువుగా ప్రశ్నించాడు ఒక దృఢకాయుడు.

తనపని అయిపోయిందని గ్రహించాడు ప్రీత్‌పాల్. తను మరణించబోతున్నాడు. మామూలుగా కాదు, చిత్రహింసలు అనుభవించి. నరకమంటే ఏమిటో ఈ జన్మలోనే ప్రత్యక్షంగా తెలుసుకొని, మెల్లిగా అతి నెమ్మదిగా మృత్యువు సమీపంలోకి చేరుకుంటున్నాడు. ఆ మాట అనుకోగానే అతనిలో మొండితనం మొలకలు వేసింది.

"రాత్రిళ్ళు పొదలమాటున తిరగటం నాకు సరదా" అన్నాడు.మొండిగా.

లాగిపెట్టి బూటుకాలితో ప్రీత్‌పాల్ డొక్కల్లో తన్నాడొక వ్యక్తి. బాధతో ప్రీత్‌పాల్ మెలికలు తిరిగిపోయాడు. సమీపంలోవున్న మనిషిని తన్నటానికి ప్రయత్నించాడు ఫలితం. మరో రెండు పిడిగుద్దులు ముఖంమీద పడ్డాయి.

"నువ్వు మొండికేసి మోడీ చేయటంవల్ల ప్రయోజనం లేదు మిస్టర్!మర్యాదగా మాప్రశ్నలకు జావాబులిస్తే బాగుంటుంది."హెచ్చరించాడు మరొకవ్యక్తి.

"నిన్న పాంజిమ్ లో చిన్నగలాటాజరిగింది. కోపంతో ఒకతన్ని సోడాబాటిల్ పెట్టి కొట్టాను. అతని తలపగిలి పోయింది. ప్రాణాలు పోయాయి. పోలీసులు నాకోసం వెతుకుతున్నారు."

"మరీ యీ విషయం ముందుగానే ఎందుకు చెప్పలేదు?"

"నన్ను పోలీసులకు పట్టిస్తారని భయం వేసింది."

"ఆల్ రైట్! నీకు భయం అనవసరం. మేము మాటాడుకున్నవన్నీ నీకు వినిపించాయి. అన్నీ విన్నావు. అవునా? కాదా?"

"నాకేమి వినిపించలేదు. నాబాధల్లో నేనున్నాను."

"అబద్ధం చెప్పకు. విన్నావా లేదా?"

"నేనేమీ వినలేదు"

రైఫిల్ తిరగవేసి ప్రీత్‌పాల్ భుజంమీద బాదాడొక వ్యక్తి. ఫట్ మని శబ్దం వినవచ్చింది. ప్రీత్‌పాల్ కళ్ళు బైర్లు

కమ్మాయి. ఆశబ్దం రైఫిల్ తగలటం వల్ల కలిగినది కాదు. కాలర్ బోను విరిగి చర్మంలోనుంచి బయటికి పొడుచుకు వచ్చింది. అదృష్టం బాగుండి ఆ కిరాతకుల బారినుంచి తప్పించుకున్నా యిక జన్మలో కుడిచేతిని ఎత్తేయోగం తనకు లేదని గ్రహించాడు ప్రీత్‌పాల్.

"మా మాటలు విన్నావా లేదా?" కరకరమంటూ వినవచ్చింది ఒక వ్యక్తి కంఠం.

"విన్నాను" పళ్ళబిగువున సమాధానం యిచ్చాడు.

"ఏమని విన్నావ్! ఏం చేశావ్?"

"మీ బ్రతుకులు ఎంత నికృష్టమైనవో తెలుసుకోవటానికి అవసరమైన మాటలన్నీ విన్నాను. చూడవలసిన వన్నీ చూశాను."

"బాస్టర్ట్! ఎంత పొగరుగా మాట్లాడుతున్నాడో చూశారా? వీడు సి.ఐ.డి నే సందేహం లేదు ఇంకా ఆలస్యం దేనికి?" పళ్ళు కొరుకుతూ అన్నాడొక వ్యక్తి.

పెదిమలు బిగపట్టి రెడీగా వున్నాడు ప్రీత్‌పాల్. అదురుతున్న గుండెలతో ఎదురుచూశాడు. ఒకటి...రెండు...మూడు... నాలుగు !!

ఐదు క్షణాల తరువాత అతని కళ్ళముందు తళుక్కున మెరిసిందొక కత్తి. బలంగా గుండెల్లో దిగబడింది.

ప్రీత్‌పాల్ నోటివెంట రక్తం వెలువడింది. పిచికారీలోనుంచి విరజిమ్మబడినట్లు గుండెలలోనుంచి పైకి వచ్చి అతని ముఖం నిండా చిందింది.... ఎర్రటి నెత్తురు.

ఒక్కక్షణం... ఒక్కక్షణంపాటు తన మాతాపితరులు ఎనిమిదో నెల గర్భంలోవున్న భార్య ప్రీత్‌పాల్ కళ్ళముందు మెదిలారు. “వాట్ ఎబౌట్ యిట్? డ్యూటీ యీజ్ డ్యూటీ!!” అనుకుంటుండగానే అతని ప్రాణాలు అనంత విశ్వంలోకి ఎగిరిపోయాయి.

## 3

“సర్.. మిస్టర్ షాడో వచ్చాడు” బాంబే సి.ఐ.డి హెడ్ క్వార్టర్స్ లోని రిసెప్షనిస్టు రిపోర్టు చేసింది. ఇంటర్ కామ్‌లో

పనామా పొగను రింగులు రింగులుగా వదులుతూ.... గోడలవంక చూస్తూ నిలబడివున్నాడు షాడో.

పదిహేనుఅంతస్థుల భవనం అది. ఆఖరిఅంతస్థులో సి.ఐ.డి హెడ్–ఫెర్నాండజ్ పర్సనల్ ఆఫీస్ వుంది.

షాడో ఎడమ చేతివైపున వున్న తలుపు ఒకటి తెరుచుకుంది? "హల్లో... కమిన్..మైబాయ్.... కమిన్...కమిన్" –అంటూ ద్వారం దగ్గిరికి వచ్చిఆహ్వానించాడు ఫెర్నాండజ్.

ఠీవిగా అటు అడుగులు వేశాడు షాడో.

"నేను చెప్పేదాక్ ఎవరినీ ఎలౌ చేయొద్దు. మమ్మల్ని డిస్టర్బ్ చేయవద్దు" రిసెప్షనిస్టును హెచ్చరించి డోర్ క్లోజ్ చేశాడు ఫెర్నాండజ్.

కుషన్ ఛైర్ లో కూర్చుని మరో పనామా వెలిగించాడు షాడో. ఎదురుగావచ్చి కూర్చున్నాడు ఫెర్నాండజ్. షాడో వంకే పరీక్షగా చూడటం ప్రారంభించాడు.

నవ్వుకున్నాడు షాడో.... బహుశా గతంలో తనను పట్టుకోవటానికి[1] సి.ఐ.డి.లు పడిన పాట్లు ఒకటొకటిగా గుర్తుకు వస్తున్నాయి కాబోలు!!!

అందుకే అంతకు ముందురోజు కులకర్ణిగారు బాంబే ప్రోగ్రాం ఫిక్స్ చేసినప్పుడు ఇంకెవరినైనా పంపించండి అని

---

*[1] షాడో గత జీవితం– అంటే – షాడో ఒక దొంగగా సంచరించిన రోజుల్లోని విశేషాలు'వాన టెడ్ డెడ్ ఆర్ ఎలైవ్' – 'టైగర్ మున్నా ' మొదలైన ఎడ్వంచర్ పుస్తకాలలో వివరించబడ్డాయి.*

పట్టుబట్టాడతను.

"వ్వాట్!! ఇంకెవరినైనా పంపాలా? మిస్టర్ షాడో రోజు రోజుకూ నీఆగడం హద్దులు మీరుతున్నది." కోపంతో నిలువెత్తున ఎగిరిపడ్డారాయన.

ఆయన్ను శాంతింపచేసే సరికి తల ప్రాణంతోకకు వచ్చినంతపని అయింది. కూర్చోపెట్టి ఒకటొకటిగా అన్నీ వివరించాడు. ఫెర్నాండజ్‌తో కలిసి పనిచేయటం ఎంత కష్టమో తెలియచేశాడు.

అంతా విని తేలికగా కొట్టిపారేశారాయన."రాజూ అప్పుడు నువ్వొక బ్లడీరోగ్‌వి. ఆ సమయంలో ఫెర్నాండజ్ నీకు విరోధి. కాని యిప్పుడు నీకు వున్న అంతస్థు అధికారం– భారతదేశంలో నాకు తప్ప మరెవరికీ లేదు. ఫెర్నాండజ్ నువ్వు చెయ్యవలసిన పనిని గూర్చి తెలియచేస్తాడు. ఆపనిలో సి.ఐ.డి. శాఖలోని యిన్ స్పెక్టర్లు అందరూ నీకు సహాయపడతారు. అంతవరకే. అతను నిన్ను ఆజ్ఞాపించటం గాని, అధికారం చెలాయించటం గాని జరగదు. పిచ్చి పిచ్చి అనుమానాలతో నన్ను వేధించకుండా పోయి పని పూర్తి చేసుకురా.... విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్" అన్నారు.

ఆపైన ఆయన్ను మాటాడించటం అసంభవం. ఆసాయంత్రమే బయలుదేరాడు తను. ఎయిర్ లైన్స్ విమానంలో బాంబే చేరుకున్నాడు. ఎయిర్ పోర్టులోనే ఎదురై నారు నలుగురు సి.ఐ.డిలు హోటల్‌కి కూడా పోనీయకుండా, సరాసరి హెడ్ క్వార్టర్స్‌కి తీసుకువచ్చారు. రోజూ సాయంత్రం ఆరు గంటలకల్లా ఆఫీస్ క్లోజ్ చేసి వెళ్ళిపోయే ఫెర్నాండజ్ ఎనిమిది గంటలయినా– యింకా ఆఫీసులోనే వున్నాడు. రిసెప్షనిస్టు – అసిస్టెంట్లు మందీ మార్బలాన్నంతా పెట్టుకొని తనకోసం ఎదురుచూస్తున్నాడు.

"వెల్ రాజూ... అప్పటికీ యిప్పటికీ నీలో మార్పేమీ రాలేదు...." ఉన్నట్లుండి అన్నాడు ఫెర్నాండజ్.

ఆమాటలతో తన ఆలోచనలనుండి బయటపడ్డాడు షాడో. డ్రాయర్‌లోనుంచి ఒక నీలిరంగు ఫోల్డర్ తీసి షాడో ముందు పెట్టాడతను.

"రాజూ... భారతీయ వనితలను బలవంతంగా అరేబియా దేశాలకు ఎగుమతిచేసి – బానిసలుగా అమ్ముతున్నట్లు వదంతులు ప్రచారంలో వున్నాయి. విన్నావా?" అని ప్రశ్నించాడు.

తలవూపాడు షాడో.

"గోవా సమీపంలో వున్న పాంజిమ్ నగరంలో ఈ గాంగ్ స్థావరాలు వున్నట్లు మాకు తెలిసింది. గాంగ్ కి నాయకుడు విక్టర్ అనే ఆంగ్లో ఇండియన్, నెల రోజుల క్రితం ప్రీత్‌పాల్ సింగ్ అనే సి.ఐ.డి. పాంజిమ్ లో వీరి జాడలను పసికట్టాడు. ఒకవారం క్రితం అతని శరీరం సముద్రంలో తేలియాడుతూ కనిపించింది."

పనామా కాలుస్తూ మౌనంగా వినసాగాడు షాడో. ప్రీత్‌పాల్ సింగ్ కి పట్టిన దుస్థితి శత్రువుల శక్తి సామర్థ్యాలను తెలియచేస్తోంది.

"ప్రీత్‌పాల్ శరీరంతోపాటు మరో ఎనిమిది మంది స్త్రీల శవాలు కూడా మాకు లభ్యమయ్యాయి. రాజూ దీన్నిబట్టి చూస్తుంటే ప్రీత్‌పాల్ వారి ఆపరేషన్ కి అడ్డంవెళ్ళాడని మనకు తెలుస్తోంది. వాళ్ళు బెదిరిపోయి టెంపరవరీగా తమ కార్యకలాపాలను నిలుపు చేసినట్లు అర్థం అవుతున్నది.

సముద్రంలో కొట్టుకువచ్చిన ఎనిమిది మంది స్త్రీల శవాలు, ప్రజలలో విపరీతమైన భయాన్ని రేకెత్తించింది. పాంజిమ్ పరిసరాలలో ఆడవాళ్ళు వంటరిగా బయటికి

రావటానికి భయపడుతున్నారు. వెంటనే వీరిని అణిచి యీ దారుణ వ్యాపారానికి స్వస్తి చెప్పకపోతే సి.ఐ.డి. పరువు ప్రతిష్టలు మట్టిలో కలుస్తాయి."

"వాట్ డూ యూవాన్ట్? వీరి స్థావరాలు ఎక్కడ వున్నాయో కనిపెట్టి మీకు రిపోర్టు చేయమంటారా?" అంటూ ఫెర్నాండజ్ మాటలకు అడ్డు వెళ్ళాడు షాడో.

అర్థం కానట్లు చూశాడు ఫెర్నాండజ్.

చిన్నగా గొంతు సవరించుకొని లేచి నిలబడ్డాడు షాడో.

"మిస్టర్ ఫెర్నాండజ్... నేనొక సీక్రెట్ ఏజెంట్ ని. నేను పనిచేసే విధానానికి సి.ఐ.డిలు ప్రైవేట్ డిటెక్టివ్ లు పనిచేసే విధానాలుకు చాలా వ్యత్యాసం వుంటుంది. నేనువేటాడవలసిన మనుష్యులు – సంఘానికి, దేశానికి ద్రోహం చేసే చీడపురుగులు అయి వుంటారు. అటువంటి వారిని పట్టి బంధించి, న్యాయస్థానాలలో వారి నేరాలను ఋజువు చేసి శిక్ష విధించటం అసంభవం – అనవసరం. వారికి తగినశిక్ష మరణమే. అది నిశ్చయంగా తెలిసిన తరువాతనే ఆ కార్యం నిర్వర్తించే బాధ్యత నామీద మోపబడుతుంది. నేను పరిశోధన చేసే విధానంలో

నేరస్తుడు నన్ను చూసినా, నేను నేరస్తుణ్ని చూసినా– వెంటనే జరగబోయేది ఒక్కటే నేనైనా ప్రాణాలు వదలాలి. నేరస్తుడైనా ప్రాణాలు యివ్వాలి."

అర్థం అయినట్లు తలఆడించాడు ఫెర్నాండజ్. ఈ కేసులు సాయపడవలసిందిగా సి.ఐ.బికి వ్రాసిన లేఖకు సి.ఐ.బి చీఫ్ కులకర్ణి యిచ్చిన సమాధానం అతని మనఃపథంలో మెదిలింది.

అడ్డువచ్చిన వారి ప్రాణాలు తీయటానికి అలవాటు పడిన ఆగాంగ్ – మామూలు పరిశోధనలకు లొంగదు. మీ రిక్విజిషన్ ని పై అధికారులకు చూపించాము. కిల్ మాస్టర్ని పంపాలని నిర్ణయించబడింది. సో... రేపు సాయంకాలం ప్రయాణమౌతున్నాడు మా షాడో. అతని చేతులకు అడ్డు వెళ్ళకండి. అతన్ని ప్రశ్నించే అధికారం మీకు లేదు.

"ఓ...కే....రాజూ... ఈకేసుకు సంబంధించిన మేటర్ అంతా ఆ ఫైలులో వుంది. వెంటనే పరిశోధన ప్రారంభించు. అవసరం అనుకుంటే సి.ఐ.డి. శాఖ అంతానీకు సాయపడటానికి సిద్ధంగా వున్నది. గుడ్ లక్ బాయ్!" అంటూ షేక్ హేండ్ యిచ్చాడు ఫెర్నాండజ్.

అతను యిచ్చిన ఫైలును అందుకొని స్మార్ట్ గా శాల్యూట్ చేసి బయలుదేరాడు షాడో.

***

షాడో పాంజిమ్ రైల్వేస్టేషన్ లో అడుగు పెట్టేసరికి సాయంత్రంఆరు గంటలు అయింది. ఎయిర్ బాగ్ ని భుజంమీద వేసుకుని స్టేషన్ బయటికి వచ్చాడు. చుట్టు ముట్టినరిక్షా డ్రయివర్లను, జట్కావాలాలను తప్పించుకొని మెయిన్ రోడ్ మీద లెఫ్ట్ రైట్ ప్రారంభించాడు.

పురానా బస్తీ– స్టేషన్ కి రెండుమైళ్ళ దూరంలో– సముద్రాన్ని ఆనుకొని వుంది. లోక్లాస్ ప్రజలునివశించే ప్రదేశం అది.

ఎనిమిది గంటల సమయానికి ఈ పురానా బస్తీలో ఒక మురికి వీధిలో అడుగు పెట్టాడు షాడో.“హల్లో... పోటుగాడా... వస్తావా?” అంటూ వినిపించిందొక కంఠం.

వద్దు అనుకుంటూనే అటు చూశాడు. ముడతలుపడిన ముఖానికి అరంగుళం మందాన పౌడర్ దట్టించింది. చౌకబారు నైలాన్ చీరె అవయవాలన్నీ బయటకు కనిపించేలా కట్టుకొని – వయ్యారంగా –

విలాసంగా నిలబడి పిలుస్తున్నదొక అభి సారిక.

"పళ్ళు బయటపెట్టి బజార్లో నిలబడటం దేనికి? లోపలకు వచ్చి చూసిపో.. మళ్ళీ నీ జన్మలో మర్చిపోవు" సవాల్ చేసింది.

"బాగాచెప్పావు తల్లీ... నీ మాటలు అక్షరసత్యాలు" అనుకుంటూ వడివడిగా అడుగులు వేశాడు షాడో.

"సార్... కత్తిలాంటి మనిషివుంది. ఎంతోకాదు. దానికి రెండురూపాయలు చాలు. నాకో యాభైపైసలు యివ్వండి అంతకంటే ఎక్కువ వద్దు" నాలుగు అడుగులు వేయకముందే అడ్డువచ్చి పడ్డాడొక వ్యక్తి.

అతను అన్న కత్తిలాంటి మనిషి నూనె ముఖం ఎరుగని చింపిరి జుట్టుతో, చిరిగిపోయిన దుస్తులతో పదిఅడుగుల దూరంలో నిలబడివుంది. ఆమెకు మరో నాలుగు అడుగుల దూరంలో నలుగురు పిల్లలు ఏడుపు ముఖాలతో పేవ్ మెంట్ మీద కూర్చుని వున్నారు. షాడోవంకా, వారి వంకా చూడలేక హైరానా పడిపోతున్నదామె.

షాడో కడుపులో ఎవరో చేయిపెట్టి దేవినట్లు అనిపించింది. తలవంచి ముందుకు అడుగులు వేశాడు.

మరో పది గజాలు వెన్నంటి పోరుపెట్టాడా వ్యక్తి. షాడో అంగీకరించక పోవటంతో వెను తిరిగి ఆమెను సమీపించాడు.

"అయ్యో" అన్న హృదయ విదారకమైన కేక వినిపించటంతో గిరుక్కున వెనుతిరిగి చూశాడు షాడో.

"ఏడుస్తూ... దేభ్యంలా నిలబడితే నీ ముఖం ఎవరు చూస్తారు? దరిద్రపు ముఖమా.. చావు..." అని అరుస్తూ ఆమె జుట్టు పట్టుకొని బాదుతున్నాడా వ్యక్తి. పేవ్ మెంట్ మీది పిల్లలు తల్లికాళ్ళనుకౌగిలించుకొని పెద్దగా ఏడ్వటం ప్రారంభించారు.

షాడో కడుపునరాలు బిగదీసుకు పోయాయి. అప్రయత్నంగా అటు అడుగులు వేయబోయి ఆగిపోయాడు.

ఆమె క్రింద పడేటట్లు ఆఖరిదెబ్బ వేసి... విసురుగా వెళ్ళి పోయాడా వ్యక్తి. పిల్లల్ని కౌగలించుకొని తనలో తాను కుమిలిపోతున్నదామె.

మెల్లిగా ఆమెను సమీపించాడు షాడో. అదిరిపడి లేచి నిలబడిందామె హడావుడిగా పిల్లల్ని పక్కలకు తోసి, పవిటె

సవరించుకుంటూ "రండయ్యా ....రండి..." అంటూ చిన్న సందువైపు తిరిగింది.

చిన్నగా నవ్వి తల అడ్డంగా తిప్పాడు షాడో. "చూడమ్మా... యీడబ్బుతో నీ కష్టాలు తీరకపోవచ్చు. కనీసం ఓ రెండురోజులైనా యీ వ్యాపారం మాని కొంచెం విశ్రాంతి తీసుకో" అంటూ రెండు ఇరవై రూపాయల నోట్లను ఆమెకుఅందించి వెనుతిరిగాడు.

"అయ్యా...అయ్యా"అని పిలిచిందామె.

వినిపించుకోలేదు షాడో. చక చకా అడుగులు వేసి వీధి మలుపు తిరిగాడు.

కిక్కిరిసి వున్నగుడిసెల మధ్యన – ఓ పెద్ద బురదగుంట వెనుక బలంగా గాలి వీస్తే పడిపోయేటట్లు కట్టబడివుంది ఒక చెక్కల మేడ. దాని గోడమీద "గదులు అద్దెకు యివ్వబడును." అన్న అక్షరాలు చాక్ పీస్ తో వ్రాయబడి వున్నాయి.

"రండి సార్... రండి...రండీ..." అంటూ ఎదురు వచ్చి షాడో చేతిలోని ఎయిర్ బాగ్ ని లాక్కున్నాడొక మధ్య వయస్కుడు.

"రోజుకు రెండురూపాయలు అద్దెసార్. పిల్లకావాలంటే మీరే వెతుక్కోవాలి. అందుకు యింకో రెండు రూపాయలు అద్దె ఎక్కువ యివ్వాలి." అని రూల్స్ వివరించాడు దుర్గంధభూయిష్టమైన ఒక మురికి గదిని చూపిస్తూ.

ఎడ్వాన్స్ పది రూపాయలు చెల్లించుకొని- గదిలోవున్న చాప మీద కూలబడ్డాడు షాడో.

"ప్రీత్‌పాల్ పరిచయం అవటానికి నెలరోజుల ముందు పాంజిమ్ పురానాబస్తీ సమీపంలో ఒ లారీ యాక్సిడెంట్ జరిగింది. ఇద్దరు వ్యక్తులు మరణించారు. డ్రయివర్ ని అరెస్ట్ చేయటం- అతనికి యావజ్జీవత కారాగార శిక్ష విధించటం జరిగింది. అయితే సి.ఐ.డి.లకు కుతూహలాన్ని కలిగించిన విషయం ఒకటి వుంది. మరణించిన యిద్దరిలోనూ ఒక వ్యక్తి అక్కడికక్కడే అయిపోయాడు. రెండవ వ్యక్తి హాస్పిటల్ లో ప్రాణాలువదిలాడు. అతని ఆఖరిక్షణంలో విక్టర్‌సార్ .. విక్టర్ సార్ ... క్షమించండి. తప్పు అయిపోయింది. అని పలువరించాడు. పోలీసులు పట్టించుకోకపోయినా... సి.ఐ.డి.లు ఆ మాటల్ని మరిచి

పోలేదు. అయితే తరువాత ఆ మాటలవల్ల ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. ఏవిధమైన ఆచూకీలు లభించలేదు."

పాంజిమ్ పరిసరాలలో 'విక్టర్' అనే మాట వినిపిస్తే పోయి చూసి వస్తున్న సి.ఐ.డి.లు నోట్ చేసుకున్నవిషయం అది. ఫెర్నాండజ్ యిచ్చినఫైలులో వివరించబడి వుంది.

షాడో అంతరంగంలో ఆ మాటలే ప్రతిధ్వనించసాగాయి ! లారీ డ్రయివర్ పేరులాల్. తప్పతాగి డ్రయివ్ చేశాడని పోలీసులు అభిప్రాయపడ్డారు. అది యదార్థమేనా కావాలని వారిద్దర్నీ పైకి ప్రయాణం కట్టించాడేమో?ముందుగా అది తేల్చుకోవాలి!!

గదికి తాళం వేసి బయలు దేరాడు షాడో. అటు తిరిగి యిటు తిరిగి పదకొండు గంటల ప్రాంతానికి ఒకసారాయి అంగడి ముందుకు చేరుకున్నాడు. వచ్చే పోయే కష్టమర్స్‌తో రద్దీగా వున్నదా అంగడి.

అందరితో పాటు ఒక గ్లాసు నాటుసారా తీసుకొని ఒక మూలకు వెళ్ళాడు. గ్లాసుసగం ఖాళీ అయ్యేసరికి ప్రక్కన కూర్చున్న పదిమందీ పరిచయం అయ్యారు.

"భాయ్ సాబ్... ఏపేట మనది?" రోజూ క్రమంతప్పకుండా ఆ అంగడికి వచ్చేవ్యక్తి ఒకడుషాడో కొత్త ముఖమని వెంటనే గ్రహించాడు.

"నాది తిరుచ్చి దాదా.. యిక్కడ నా స్నేహితుడు వున్నాడు .చూసి పోదామని వచ్చాను." సమాధానం యిచ్చాడు షాడో.

"ఎవరా స్నేహితుడు?"

"లాల్ అనీ – లారీ డ్రయివర్."

"ఏదీ! సులేమాన్ గారేజీ లాల్ సంగతే కదూ... యాక్సిడెంట్ చేసి జైలుకు వెళ్ళాడు." అవునని అందామనుకున్నాడు షాడో. యాక్సిడెంట్ సంగతి తెలియనట్లు నటిద్దామని ఆలోచించాడు .

కాని. ఆమాట అన్న మరుక్షణం ఆవ్యక్తి ఎందుకో ఖంగారుగా అక్కడినుంచి లేచి వెళ్ళిపోయాడు.

షాడో నొసలు ముడిపడింది. సగంఖాలీ అయిన గ్లాసును అలాగేవదిలి మెల్లిగా బయటకు వచ్చాడు. పనామా వెలిగించుకొని తాపీగా అడుగులు వేస్తూ తన గదికి బయలుదేరాడు.

ఉన్నట్లుండి మెడమీద బలమైన దెబ్బ ఒకటి పడింది. ముందుకుతూలి, బాలెన్స్ నిలబెట్టుకోవటానికి ప్రయత్నిస్తుండగా... మరో దెబ్బ– క్రిందపడి పోయాడు . మరుక్షణం నాలుగు జతల కాళ్ళు.. అతని శరీరంతో ఫుట్ బాల్ ఆడుకున్నాయి.

షాడో ఊపిరి తీసుకోవటానికి కూడా వ్యవధి లేకపోయింది. రెండు క్షణాలలో అతన్ని చిత్తు చిత్తుగా కొట్టి, ఎలా వచ్చారో అలాగే హఠాత్తుగా మాయం అయిపోయారు నలుగురు వ్యక్తులు.

ఎందుకో, ఏమిటో అర్థంకాక ఎదురు తిరగలేదు షాడో. ప్రాణాలు తీయనంత వరకూ ఎన్ని దెబ్బలు కొట్టినా బాధలేదు. వారు వెళ్ళిపోయారని తెలిసి మెల్లిగా లేచి నిలబడ్డాడు. పాంటు బురదతో తడిసిపోయింది. చొక్కా నామరూపాలు లేకుండా నాశనమై పోయింది. నాటుసారా కొద్దిగా ఎక్కివుండటంవల్ల – తగిలిన దెబ్బలు అంతగా బాధించటంలేదు.

సందు మొగదల నుంచి మరో ఆకారం అటురావటం కనిపించింది. ఈసారి ఎవరొచ్చినా వదిలి

పెట్టకూడదనుకుంటూ రెడీగా నిలబడ్డాడు.

"అయ్యా... దెబ్బలు బాగా తగిలాయా?" దగ్గరకివస్తుఅన్నదా ఆకారం.

వెంటనే గుర్తుపట్టాడు షాడో. అంతకుముందు తను డబ్బుయిచ్చిన ఆడమనిషి... "సారా అంగడిదగ్గిర మిమ్మల్ని చూశానయ్యా... షిక్కాఅనుచరులు మిమ్మల్ని కొట్టాలని అనుకోవటం విన్నాను . హెచ్చరిద్దామని అనుకుంటుండగా .. వాళ్ళు మిమ్మల్ని కమ్మేశారు."

లైటు లేని కరెంటు స్తంభాన్ని ఆనుకొని నిలబడి ఆమెవంక సూటిగా చూశాడు షాడో.

"అయ్యా.. జైలుకి పోయిన లాల్ షిక్కా స్నేహితుడు. ఇదివరకు మీలాగే వచ్చి ప్రశ్నలు వేశారు పోలీసులు. ఎవరైనా వాళ్ళకి సమాధానం యిస్తే నరికి పోగులు పెడతానని బెదిరించాడు షిక్కా. వాడు అన్నంత పనీ చేయగలడయ్యా. అందుకే అందరూ నోళ్ళకు తాళాలు వేసుకున్నారు."

"మరి నువ్వు ఎందుకు చెప్తున్నావ్? షిక్కా అంటే నీకు భయంలేదా?" సూటిగా అడిగాడు షాడో.

"పది సంవత్సరాల నుంచీ మానం అమ్ముకొని

జీవిస్తున్నా నయ్యా. మాశరీరాలతో ఆడుకొని, ఆ తర్వాత అసహించుకొన్న వారేకాని. మాబ్రతుకులను అర్థంచేసుకొని జాలిపడిన వారిని యింతవరకూ చూడలేదు. మొట్టమొదటి సారిగా మిమ్మల్ని చూశాను. మీఋణం ఎలాగైనా తీర్చుకోవాలని మిమ్మల్ని అనుసరించాను."

చిరిగిపోయిన పాంటు జేబులో నుంచి వాలెట్ తీశాడు షాడో. రెండువందరూపాయలనోట్లను బలవంతంగా ఆమె చేతిలో పెట్టాడు.

"చూడమ్మా... షిక్కా అడ్రస్ చెప్పు.. యింకేమీ వద్దు." అన్నాడు.

"కాళీమందిరం పక్కన వున్న గులాబీ తోట వాడిదే అయ్యా..." జవాబు యిచ్చిందామె.

మరుక్షణం మాయం అయ్యాడు షాడో.

***

కాళీ మందిరం ప్రక్కన పెద్ద గులాబీతోట వుంది. చుట్టూ ఆరడుగుల ఎత్తున్న ప్రహరీ ... తోట మధ్యన పెద్ద మేడ.. మేడ ముందున్న ఖాళీ స్థలంలో పది టాక్సీలు నాలుగు లారీలు – షిక్కా అంతస్థును తెలుపుతున్నాయి.

గేటుముందునిలబడి “హల్లో ... ఎవరైనా వున్నారా?” అని అరిచాడు షాడో.

మరుక్షణం పరుగెత్తుకుంటూ వచ్చి గేటు తెరిచారు యిద్దరు దృఢకాయులు. “షిక్కా వున్నాడా?” ఠీవిగా అడిగాడు షాడో.

వారి ముఖాల్లో ప్రతిఫలించిన అనుమానాన్ని చూపి తనలోతను నవ్వుకున్నాడు.

సహచరుడివంక చూసి తల విదిలించాడు ఒక వ్యక్తి.

“రెండు నిముషాలు వెయిట్ చెయ్యాలి.. కబురు పంపించాను.” అన్నాడు షాడో వంక దురుసుగా చూస్తూ.

తన్ను లాటలో నలిగిపోయిన పనామా పాకెట్ లో నుంచి సగం విరిగి పోయిన సిగరెట్ ని తీసి వెలిగించుకున్నాడు షాడో.

అది పూర్తిఅయ్యేసరికి మేడలోనుంచి ఒక ఆజానుబాహుడు బయటికి వచ్చాడు కండలు తిరిగిన శరీరం. సిల్కు దుస్తులు – కరుకుదనం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్న ముఖం చూడగానే షిక్కా అంటే అతనే అని గ్రహించాడు షాడో.

గేటు దగ్గిరికి వచ్చి నిలబడ్డాడతను. షాడో వంక అనుమానంగా చూశాడు "ఐయామ్ సారీ.. షిక్కా అంటే నాకు తెలిసిన మనిషి అనుకొని వచ్చాను. ఇంత రాత్రివేళ మీకుట్రబుల్ యిచ్చినందుకు క్షమించండి." అంటూ వెను తిరగబోయాడు షాడో.

కోపంతో అసహ్యంగా తయారయింది షిక్కాముఖం. పళ్ళు కొరుకుతూ పిడికిలి బిగించి ముందుకు అడుగువేశాడు.

మెరుపులాత లవంచి పక్కకుదూకాడు షాడో. గేటు వెనుక నిలబడి వున్న షిక్కాఅనుచరుడి చేతిలో ఒక కత్తి ప్రత్యక్షం అవటం కనుచివరలనుంచి చూశాడు.

ముందుకు వచ్చిన షిక్కా పొట్టమీద బలంగా గుద్ది–శక్తి నంతా వుపయోగించి గేటును వెనక్కితోశాడు.

కత్తిని విసరబోతున్నాడా అనుచరుడు. కిర్రుమని శబ్దం చేస్తూ గేటువచ్చి గుద్దుకోవటంతో వెల్లికిలా పడిపోయాడు.

మరుక్షణం మోకాలితో షిక్కా డొక్కలో పొడిచాడు షాడో, షిక్కా నన్ను అనవసరంగా కొట్టించావ్... అందుకు ఫలితం వడ్డీతో సహా అనుభవిస్తావ్ చూడు..." అంటూ

బలంగా మరో దెబ్బ వేసి వెనుతిరిగాడు.

"పకడో .. బద్మాష్‌కూ పకడో... " అని అరవటం ప్రారంభించాడు గేటు తగిలి కింద పడిన వ్యక్తి.

మేడలోనుంచి పాతిక మంది దృఢకాయులు పరుగు పరుగున గేటు దగ్గిరిగి వచ్చారు. అప్పటికే చాలా దూరం వచ్చేశాడు షాడో. చీకటి మాటున, మురికి సందుల్లో ప్రవేశించి కంటికి కనిపించకుండా మాయం అయిపోయాడు.

***

"షిక్కా భవనం దగ్గిర గొడవ చేసి రావటం సమంజసమా? కాదా?"మంచం మీద పడుకొని, పనామా పొగను సీలింగ్ వైపు వదులుతూ తనలో తనే తర్క వితర్కాలు జరుపుకుంటున్నాడు షాడో.

తెల్లవారటానికి రెండు గంటల వ్యవధి వుంది. వెలుగు వచ్చిన మరుక్షణం షిక్కా అనుచరులు తన కోసం వేట ప్రారంభిస్తారు. కనిపించిన మరుక్షణం కాళ్ళు చేతులు విరుగగొట్టి సముద్రంలో పడేస్తారు.

పనామా చివరికంటా కాలి – వేళ్ళను

చురుక్కుమనిపించటంతో, ఉలిక్కిపడి ఆలోచనల నుంచి బయటపడ్డాడు.

సిగిరెట్ అవతలకు విసిరికొట్టి – బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ లేచాడు. వెలుగు వచ్చేలోగా మకాం మార్చాలి? మంచంమీద పడవేసిన సామానులను ఎయిర్ బాగ్ లో సర్ది మరో సిగిరెట్ వెలిగించాడు.

నెమ్మదిగా పురానాబస్తీ నిద్రనుంచి మేల్కొనటం ప్రారంభించింది. ఒకరిద్దరుగా బజార్లలో ప్రత్యక్షం కాసాగారు పురానాబస్తీ నివాసులు.

గదికి తాళంవేసి నిశబ్దంగా మేడమెట్లుదిగాడు షాడో.ఎంట్రెన్స్ దగ్గిరే చాప పరుచుకొని – గురకలు తీస్తున్నాడు. లాడ్జి ఓనర్. అతనికి నిద్రాభంగం కలుగకుండా తాళంచెవిని అతని తలగడ క్రిందపెట్టి – రోడ్డు మీదికి వచ్చాడు షాడో.

నిర్మానుష్యంగా వున్న సందులలో ప్రయాణించి – వెలుగు వేళకుపురానా బస్తీ సరిహద్దులు దాటాడు. రైల్వే స్టేషన్ కి సమీపంలో వున్నదొక పెద్ద మోడ్రన్ హోటల్. అందులో ఒక ఎయిర్ కండిషన్డ్ గదిని తీసుకొని – పగలంతా

నిద్రలో గడిపాడు.

తిరగి మెలుకువ వచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలు అయింది. కాలకృత్యాలు తీర్చుకుని బ్లాంక్ పాంటు, బ్లాక్ షర్టు వేసుకున్నాడు. రివాల్వర్ క్లీన్ చేసి ఫ్రష్ బుల్లెట్లు ఎక్కించాడు డాగర్ పదును పరిశీలించి – మెల్లిగా బయలుదేరాడు.

తాపీగా అడుగులువేస్తూ పురానాబస్తీలోని గులాబీ తోటను చేరుకునేసరికి పది గంటలు అయింది.

నిర్మానుష్యంగా వుంది ఆ ప్రదేశం. కారుచీకటితో నిండి భయంకరంగా కనిపిస్తోంది.

కాళికాలయంలో వున్న ధ్వజస్తంభం చాటున కూర్చుని ఒక గంటసేపు కాలం గడిపాడు షాడో. గులాబీతోట ప్రహరీ మీదుగా షిక్కా భవంతి కనిపిస్తోంది.

ఒకటొక్కటిగా ఆ భవనంలోని లైట్లు ఆరిపోయాయి. ఒకే ఒక కిటికీలో నుంచి సన్నటి వెలుగు రేఖలు బయటకు ప్రసరిస్తున్నాయి.

నెమ్మదిగా లేచాడు షాడో .పిల్లిలా అడుగులు వేస్తూ ప్రహరీని సమీపించాడు. అటూ యిటూ చూసి, చటుక్కున

జంప్ చేసి గోడ మీది నుంచి తోటలోకి దూకాడు.

నాలుగు అడుగులు ఎత్తున్నాయి గులాబీ పొదలు. విరబూసిన పూలతో కళకళలాడుతున్నాయి. మనసు మత్తెక్కించేట్లుంది ఆ సువాసన.

రెండు గులాబీలను కోసి జేబులో వేసుకున్నాడు షాడో. అర్ధంలేని ఆ పనికి తనలో తనే నవ్వుకుంటూ, పొదల చాటు చేసుకొని కిటికీవైపు జరిగాడు.

కిటికీ సమీపిస్తున్న కొద్దీ.. ఆ కిటికీ ఆవల ఎవరో మాట్లాడుకుంటున్న మాటలు అస్పష్టంగా వినిపించటం ప్రారంభించాయి.

"షిక్కా– విక్టర్" అన్నమాటలులీలగా షాడో చెవులకుసోకాయి. షాడో గుండెలు వేగంగా కట్టుకోవటం ప్రారంభించాయి. తన అంచనాలు నిజం కాబోతున్నాయా?షిక్కాకు విక్టర్‌కి సంబంధం వున్నదని అనుకున్న మాట యదార్ధమా?

వేగంగా కిటికీవైపు జరిగాడు షాడో. గోడను పట్టుకొని మెల్లిగా లేచి నిలబడబోయాడు.

అదే సమయంలో అతనికి ఎడమచేతి వైపునుంచి

ఎవరో వస్తున్నట్లు అడుగుల శబ్దం వినవచ్చింది.

కలుగులోనుంచి బయటికివస్తుండగా – ఎదురుపడిన పిల్లిని చూసి చటుక్కున కలుగులోకి దూరిపోయిన ఎలుక లాగా శరవేగంగా పొదలమధ్యకు జారుకున్నాడు షాడో.

సరిగ్గా అతను దాగుకున్న పొద ముందుకు వచ్చి ఆగి పోయిందా అడుగుల చప్పుడు.

మోకరించి కూర్చున్న షాడో, వూపిరి బిగపట్టి – ఆకుల సందుల్లోనుంచి చూశాడు. ఇద్దరువ్యక్తులు కిటికీ గోడను ఆనుకొని నిలబడివున్నారు. వారిలో ఒకతను అంతకుముందు రోజు షాడో చేతిలో దెబ్బతిన్న మనిషే.

"... లేదు. తెల్లవారక ముందే గది ఖాళీచేసి పారిపోయాట్ట. ఎందుకైనా మంచిదని షిక్కా జాగ్రత్తగా వుండమని హెచ్చరించాడు."

చేతిలోవున్న బాణాకర్రను గోడకు ఆనించి చేతులు రుద్దుకుంటూ అంటున్నా డొకవ్యక్తి.

చెవులు రిక్కించాడు షాడో.

"పోలీసులతో యవ్వారం.. నిజమే మరి. జాగ్రత్తగా వుండకపోతే మనపని గల్లంతే..."

కొంచెం ముందుకు జరగటానికి ప్రయత్నించాడు షాడో. గులాబీ ముళ్ళు అతని మోచేతిని చీల్చి రక్తాన్ని చవిచూశాయి.

మెడమీద సూదులుపెట్టి పొడిచినట్లు చురుక్కుమనిపించటంతో – షాడో శరీరం జలదరించింది. మెడ సవరించుకున్నాడు. చింతగింజంత వున్న గండుచీమ చేతికిఅందింది.

నేలకు ఆనించిన చేతిమీదనుంచి జరజరపాకటం ప్రారంభించాయి చీమలు. వాటిపుట్ట సరిగ్గా షాడో కాలికింద వున్నది. ఇక అక్కడ వుండటం ఏమంత మంచిది కాదని గ్రహించాడు. మంచిదికాదు – బాగానే వుంది. కానికదలటం ఎలా? ఏమాత్రంశబ్దం చేసినా గోడ దగ్గిరవున్న వారికి వినిపిస్తుంది.

చీమలు కలిసి కట్టుగా షాడో శరీరాన్ని పీకి పాకాన పెట్టటం ప్రారంభించాయి. పళ్ళు బిగపట్టి ఓర్చుకున్నాడు షాడో. కాని క్షణక్షణానికి ఆ బాధ అధికం కాసాగింది.

“షిక్కా ఎందుకో భయపడుతున్నట్లుందిరా...”

“భయపడక ఏంచేస్తాడు? పోలీసుల విషయంలో

చాలా జాగ్రత్తగా వుండమనివిక్టర్ సార్ నొక్కిచెప్పి పోయాడు. ఇప్పుడు జరిగినవిషయం, తెలిస్తే షిక్కా తల వాచి పోతుంది చివాట్లతో !!!

చీమల సంగతి మరిచిపోయాడు షాడో. గులాబీ ముళ్ళు ముఖానికి గుచ్చుకుంటున్నాలక్ష్య పెట్టకుండా మరికొంచెం ముందుకు జరిగాడు.

కాని ఆమాటతో ఆవ్యక్తుల సంభాషణ అంతం అయిపోయింది. కర్రలూపుకుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయారు.

వారి అడుగుల శబ్దం వినిపించకుండా పోయేటంత వరకూ కదలలేదు షాడో.

పదినిముషాలు అలాగే వుండి, ఆ తర్వాత లేచి నిలబడ్డాడు. వంటినిండా పాకుతున్న చీమలను విదిలించుకుంటూ కిటికీని సమీపించాడు.

దీపం వెలుగుతూనే వున్నది మాటలు మాత్రం వినిపించటంలేదు. కిటికీ తలుపులు తెరవటానికి ప్రయత్నించాడు. ఫలితం లేకపోయింది. లోపలివైపు గొళ్ళెం పెట్టబడినట్లుంది.

రెండు అడుగులు వెనక్కి వేసి భవనాన్ని పరిశీలనగాచూశాడు. నాలుగు అంతస్థుల మేడ అది. పైకి వెళ్ళటానికి డ్రైనేజి పైపులుకూడా లేకుండా నున్నగా నిట్టనిలుపుగా వుంది.

కుడిచేతివేపు తిరిగి గోడకు ఆనుకొని అడుగులు వేశాడు. మేడ రెండవ ప్రక్కన అనేక రకాలఫల వృక్షాలున్నాయి. ఒక కొబ్బరి చెట్టు మేడకు నాలుగు అడుగుల దూరంలో– మూడవ అంతస్థు వరకూ ఎదిగి వుంది.

షాడో ప్రాణంలేచివచ్చింది. పెద్ద పెద్ద అడుగులతో దాన్ని సమీపించాడు. క్షణంకూడా ఆలస్యం చేయకుండా దాని మీదుగా మూడవ అంతస్తు పారాసెట్ మీదికి చేరుకున్నాడు.

అటువైపు ఒకే ఒక కిటికీవుంది. పల్చటి పట్టు తెరలతో మూయబడివుంది. నిశబ్దంగా తెరలను తొలగించి లోనికి అడుగు పెట్టాడు.

విశాలమైన గది అది. గోడలనిండా చక్కటి వర్ణచిత్రాలు తగిలించి వున్నాయి. గదికి ఒక చివరగా విమానంలాంటి

ఫోమ్ బెడ్ ఒకటివుంది.

భుజాలవరకూ దుప్పటి కప్పుకొని– అర్ధనగ్నంగా దానిమీద నిద్రిస్తున్నదొక సుందరి.

క్రింది అంతస్థులో ఎవరో సంచరిస్తున్నట్లు అడుగు శబ్దాలు – మాటలు అస్పష్టంగా షాడో కర్ణేంద్రియాలకు సోకుతున్నాయి. ఎవరైనా ఆ గదిలోకి వస్తే దాక్కోవటానికి సరియైన స్థలం కోసం వెతుకుతున్నాయి షాడో కళ్ళు.

బెడ్ క్రిందకు చేరటంతప్ప మరోదారి కనిపించలేదు. ఏమాత్రం అలికిడి అయినా, ఆనిద్రిస్తున్న సుందరీమణి లేచే ప్రమాదంవుంది.

మంచానికి అవతలగా ఉన్న ద్వారబంధంషాడో దృష్టిని ఆకర్షించింది. అవతలి గదులలోకి వెళ్ళటానికి అక్కడి నుంచి అదొక్కటే మార్గం.

అటు అడుగులు వేస్తూ– కుతూహలాన్ని ఆపుకోలేక రెండు క్షణాలు బెడ్ దగ్గిర నిలబడ్డాడు. వంకీలజుట్టు పట్టు తెరలలాగా ఆమె ముఖాన్ని మరుగు పరుస్తున్నది. ఆ ప్రదేశమంతా ఆవరించివున్న గులాబీల వాసనను ధిక్కరించి, మరో విధమైన సుగంధ పరిమళం షాడోనాశికా రంధ్రాలకు

సోకింది.

మెల్లిగా ముందుకు వంగాడు. అరేబియన్ దేశాలలో తయారుచేయబడే అతి ఖరీదయిన సెంట్ వాడుతున్నదా సుందరి. ఆ సువాసన ఆమె వద్దనుంచే వస్తున్నది.

జేబులో దాచిన గులాబీల సంగతి గుర్తుకువచ్చి - వాటిని బయటికి తీశాడు. ఆమెకు నిద్రాభంగం కలుగకుండా వాటిని ఆమె సిగలో అలంకరించి, అవతలకు జరిగాడు.

ఆ గదికి అవతల పెద్ద కారిడార్ ఉన్నది . కారిడార్ చివర మెట్లు వున్నాయి. నాలుగో అంతస్థుకు పోవాలన్నా, క్రింద వున్నగదులకు వెళ్ళాలన్నా అటునుంచే పోవాలి.

బెల్టు వెనుక దాచిన రివాల్వర్ ని తీసి పట్టుకున్నాడు. ఎంత నిగ్రహించుకున్నా, ఏదో తెలియని ఎక్సైట్ మెంట్ షాడో రక్తాన్ని వుడుకెత్తించసాగింది. అతని సిక్స్త్‌సెన్స్- అది విక్టర్ స్థావరం అయివుండవచ్చుని సజషన్ యివ్వటం ప్రారంభించింది.

***

మూడవ అంతస్థునుంచి గ్రౌండ్ ఫ్లోర్ లోకి వచ్చాడు

షాడో రాజభవనంమాదిరి అలంకరించబడి ఉందది. గోడలకు అందమైన పట్టుతెరలు వేలాడుతున్నాయి. నేలమీద మెత్తటి కాశ్మీర్ తివాచీ పరిచి వుంది. నల్లటి టేకుతో చేయబడిన కుర్చీలు, టీపాయ్ లు, ఆగది అందాన్ని పదిరెట్లు పెచుతున్నాయి.

షాడో నిలబడిన గోడకు పది అడుగులదూరంలో ఉన్న ద్వారం నుంచి ఒక వృద్ధుడు హాల్లోకి వచ్చాడు. అతని చేతిలో ఒక ట్రేవున్నది. దానినిండా రకరకాల ఆహార పదార్థాలు నింపి వున్నాయి.

లైటువెలుగుతున్న గది ముందు నిలబడి కాలితో తలుపు తట్టాడతను. తలుపు తెరుచుకున్నది. లోపలికిపోయి రెండుక్షణాల్లో బయటికి వచ్చాడా వృద్ధుడు.

వెంటనే తలుపులు మూసుకున్నాయి.

ఆవృద్ధుడు అక్కడినుంచి వెళ్ళి పోయేదాకా ఆగాడు షాడో. మెల్లిగా వెళ్ళి ఆగది దగ్గిరనిలబడ్డాడు.

రెండు క్షణాల పాటు తన ఉశ్వాస నిశ్వాసాల చప్పుడు తప్ప మరే యితర శబ్దమూ షాడోకు వినిపించలేదు.

మరికొంచెం ముందుకు జరిగి తలుపును చెవి

ఆనించాడు.

గాజు గ్లాసులు కదిలిన మోత వినిపించింది. సారాయి త్రాగి ఎవరో త్రేనుస్తున్న అలికిడి వినవచ్చింది.

"కాపలాకి ఎంతమందిని పంపించావ్!"

ఉన్నట్లుండి వినవచ్చిందా కంఠం. ఉలిక్కిపడి , రివాల్వర్ ని పైకి ఎత్తాడు షాడో. మరుక్షణం ఆ కంఠం గది లోపలినుంచి మాట్లాడిందని తెలుసుకున్నాడు. నవ్వుకుంటూ తిరిగి తలుపుకు చెవి ఆనించి నిలబడ్డాడు.

"నలుగుర్ని పెట్టాను... ఏమైనా... మనంతొందర పడ్డామని అనిపిస్తోంది."

"నిజమే. అతనెవరో ,ఎందుకువచ్చాడో సరిగ్గా తెలుసుకోకుండా కొట్టించాం. అతను కూడా మనలాంటి వాడే. వెంటపడి అదరకొట్టి పోయాడు."

"షిక్కా చాలా భయపడుతున్నాడు. విక్టర్ కి యీ గొడవ తెలిస్తే కోపం చేస్తాడేమో అని బెదిరిపోతున్నాడు."

షిక్కా ఆగదిలో లేడని గ్రహించాడు షాడో. గదిలో యిద్దరే ఉన్నట్లు రెండే కంఠాలు వినిపిస్తున్నాయి.

"అలా అని వూరుకుంటే ఎలా? వెంటనే ఈ విషయం

విక్టర్‌కిరిపోర్టు చెయ్యాలి.”

“ఎలా చేస్తాం! ఇరవైనాలుగవ తారీఖున గాని బయలుదేరటం కుదరదని వార్త పంపించాడు. కైరో సమీపాల్లో ఏదో వ్యవహారం సెటిల్ చేసుకొని నెమ్మదిగా వస్తాట్ట.”

షాడో గుండెలు వేగంగా కొట్టుకోవటం ప్రారంభించాయి. సో... విక్టర్ కైరో సమీపాల్లో ఉన్నాడన్నమాట. ఇరవై నాలుగవ తారీఖున బయలుదేరి ఇండియా వస్తాడు...ఈరోజు.. ఆరవ తారీఖు.. అంటే యింకో పద్దెనిమిది రోజుల టైం వుంది.

“షిక్కా ఎప్పుడు వస్తాడు?”

“ఇప్పుడే వస్తానని వెళ్ళాడు... ఏ నిముషంలో వచ్చినా రావచ్చు–”

గిరుక్కున వెనుతిరిగాడు షాడో మోకాళ్ళుమడిచిగోడ ప్రక్కగా దొర్లాడు.

సర్..ర్ మని శబ్దంచేస్తూ, అంతవరకూ షాడో తలవున్న ప్రదేశంలో దిగబడింది ఆరు అంగుళాల పొడవున్న బాకు.

క్రిందపడిన మరుక్షణం రివాల్వర్ ఎత్తి ట్రిగ్గర్ నొక్కాడు షాడో. ముఖద్వారం దగ్గిరికి వెళ్ళేమార్గం ముందు నిలబడి ఉన్నాడు షిక్కా. షాడో బుల్లెట్ అతని ఎడమభుజంలో దిగబడింది. పెద్దగా అరుస్తూ కిందపడిపోయాడు.

మాటలు వినిపించిన గది తలుపులు తెరుచుకున్నాయి.

"ఏమిటి? ఏమయింది?" అని అరుస్తూ బయటికి పరుగెత్తుకు వచ్చారు యిద్దరు దృఢకాయులు.

హాలుకు మధ్యగా సీలింగ్ మీద నాలుగు ట్యూబ్ లైట్లు అందంగా అలంకరించబడి వున్నాయి.

రివాల్వర్ వాటికేసి గురిపెట్టాడు షాడో. రివాల్వర్ మ్రోగినట్లే 'టప్ టప్'మని శబ్దం చేస్తూ పగిలిపోయాయవి, అంతా చీకటి మాయం అయిపోయింది.

రివాల్వర్ మోతలు విని బయటవున్నవారందరూ అక్కడికి వస్తున్నట్లు తెలుసుకొని మెట్లవైపు పరుగెత్తాడు షాడో.

"టార్చి.. టార్చిలైటు తీసుకురండి!!" అరుస్తున్నాడొకవ్యక్తి.

మెట్లమీద కాలుపెట్టిన షాడో.. వేగంగా క్రిందికి పరిగెత్తుకు వస్తున్న వ్యక్తితో ఢీకొన్నాడు. ఇద్దరూ మెట్లమీద నుంచి క్రిందికి దొర్లారు.

"బద్మాష్... కళ్ళు కనిపించటంలా? చూసి అడుగులు వెయ్యలేవూ?" అంటూ షాడో డొక్కలో బలంగాగుద్ది లేచినిలబడ్డాడా వ్యక్తి.

నిశబ్దంగా పక్కకు దొర్లాడు షాడో. బయటినుంచి పదిమంది వ్యక్తులు హాల్లోకి రావటం చూశాడు. వారి చేతుల్లోని టార్చిలైట్లు హాలును కాంతివంతం చేశాయి.

వెంటనే సమీపంలోవున్న గదిలోకి దొర్లాడు.

"పోతున్నాడు.. పట్టుకోండి... పట్టుకోండి..." అంటూ అరిచారెవరో.

గదిలోకి దొర్లిన షాడో నేలకు కొట్టబడిన బంతిలాగా లేచి నిలబడ్డాడు. కనిపించిన మార్గాన్ని అనుసరించి అతి వేగంగా అవతలకు పోయాడు.

ఎదురుగా పాతిక అడుగుల దూరంలోసగం తెరిచి ఉన్న తలుపులు కనిపించాయి. భవనం వెనుకవున్న తోటలోకి పోయే మార్గం అది. ఆవిషయం గాలివాలున

లోపలికి వస్తున్న గులాబీ పరిమళాలు తెలుపుతున్నాయి.

కాని ఆ తలుపుల్ని సమీపించే వ్యవధిలేదు. వెనుకనుంచి అడుగుల చప్పుడు అతి సమీపంలోకి వచ్చేసింది.

కంటికి కనిపించిన మొదటి గదిలోకి దూరి తలుపులు గడియపెట్టాడు షాడో.

ఆగదిలో అంతక్రితం ట్రేతో ఆహార పదార్థాలు తీసుకువచ్చిన వృద్ధుడు వున్నాడు. ముడతలు పడిన ముఖం, నెరిసి పోయిన జుట్టుతో భయంకరంగా కనిపిస్తున్న భార్యవుంది. పదిహేడేళ్ళ పడుచు – అతని కూతురు కాబోలు... భయంతో నోరు తెరుచుకొని చూస్తూ వున్నది.

తలుపుగడియపెట్టి వెనుతిరిగాడు షాడో– వారందర్నీ చూసి క్షణకాలం నిరుత్తరుడై పోయాడు.

"అదిగో... ఆ దోవగుండా తోటలోకి పోయినట్లున్నాడు.. పదండి... ప్రాణాలతో వదలకూడదు" అని అరుస్తు గదిముందు నుంచి అవతలకు పరిగెత్తుతున్నాడు షిక్కాఅనుచరులు.

ఆ పరిస్థితిలో తన ఎదుటవున్న ముగ్గురూ గంయ్

మని అరిచి కేకలు వేస్తే తన గతి ఏమౌతుందో వూహించి – తల విదిలించాడు షాడో.

రివాల్వర్ వారికేసి గురిపెట్టి మాటాడవద్దని సైగ చేశాడు. ఆసైగతో ఆశ్చర్యం నుంచి తేరుకున్నదా పడుచుపిల్ల. అరవటానికే ప్రయత్నించింది.

మెరుపులా అటు దూకాడు షాడో. లాగిపెట్టి చెంపమీద కొట్టాడు.

"మర్యాదగా నోరు మూసుకొని – మీ పనులు మీరు చేసుకోండి. మీకు నావల్ల ఎటువంటి ప్రమాదమూ రాదు. అరిచి అందరినీ పిలవటానికి ప్రయత్నిస్తే మాత్రం మీప్రాణాలు మీవికావు " అని బెదిరించాడు.

కంపిస్తున్న అవయవాలను స్వాధీన పరచుకోవటానికి ప్రయత్నిస్తూ తలవూపాడు వృద్ధుడు.

చెంప తడుముకుంటూ బెదురు చూపులు చూస్తున్నపడుచు పిల్లవైపు తిరిగిచిరునవ్వు నవ్వాడు షాడో.

"అమ్మో!" అని అరుస్తూ తల్లి చాటుకు గెంతిందా పిల్ల.

అదిరిపడి ద్వారంవంక చూశాడు షాడో. ఆకేక ఎవరికీ వినిపించినట్టులేదు. తేలికగానిట్టూర్చి కనిపించిన స్టూలు

మీద కూర్చున్నాడు.

అతనివంక దొంగచూపులు చూస్తూ తమ పని తాము చేసుకోవటం ప్రారంభించారు వృద్ధదంపతులు యిద్దరూ.

పెద్ద పెద్ద పాత్రలనిండా ఆహార పదార్థాలు వండి వున్నాయి. వాటిని ట్రేలలో నింపుతున్నారు.

వాటిని చూడగానే షాడో విపరీతమైన ఆకలికి గురిఅయ్యాడు.

"ఏయ్..." అన్నాడు పిల్లవంక చూస్తూ.

తల్లి భుజాన్ని మరింతగా పట్టుకొని ఏడుపు ముఖంతో చూసిందామె.

"అవి ఒక పళ్ళెంలో పెట్టి యిటు తీసుకురా" కమాండ్ చేశాడు షాడో.

వణుకుతున్న చేతులతో ఒక స్టీలు ప్లేట్ నిండా నింపి... మెల్లిగా వచ్చి అందించిందా పిల్ల.

అదే సమయంలో తలుపు తట్టిన శబ్దం వినవచ్చింది.

"తలుపు తెరవరా ముసలోడా... తలుపు తెరువ్..." అన్నది ఒక కర్కశకంఠం.

ఎడమచేత్తో పళ్ళెం అందుకొని– కుడిచేత్తో ఆ పిల్ల మెడ

దొరక బుచ్చుకున్నాడు షాడో. బలంగా ముందుకు గుంజి గట్టిగా కౌగిలించి పట్టుకున్నాడు.

"నేను యిక్కడికి వచ్చినట్లు చెప్పారో– యీ పిల్ల మీకు దక్కదు. జాగ్రత్త" అని హెచ్చరించి ఒక మూలకు జరిగి నిలబడ్డాడు. రెండు నులక మంచాలు నిలబెట్టి ఉన్నాయక్కడ. వాటి చాటున చేరాడు.

"తలుపు తీయమంటే – వినిపించటంలేదా? అరేయ్ ముసలాడా?" కోపంగా తలుపును బాదుతూ అరిచాడు బయటనిలబడిన వ్యక్తి.

ఆదరా బాదరాగాపోయి తలుపు తెరిచాడు వృద్ధుడు.

నలుగురు వ్యక్తులు లోపలికి వచ్చారు. ఆ గదినంతా ఒకసారి కలియచూసి వృద్ధుడివైపే తిరిగారు.

చలిజ్వరం వచ్చినట్టు వణికి పోతున్నాడతను, అది గమనించి – రివాల్వర్ ఎత్తి పట్టుకున్నాడు షాడో.

"రేయ్ ... ఎందుకురా అలా వణికిపోతున్నావ్?" వృద్ధుణ్ణి అడిగాడొక వ్యక్తి.

"భ..భయం వస్తోందయ్యా – క...త్తుల్ని చూస్తే నాకు మాచెడ్డభయం..." వారి చేతుల్లోని బాకులవైపు చూపిస్తూ

అన్నాడు వృద్ధుడు.

వికటంగా నవ్వి వెనుతిరిగారా నలుగురూ "తలుపువేసుకో బే...బయటికి రాకు" అని సలహా యిచ్చి వెళ్ళిపోయారు.

మంచం చాటునుంచి యివతలికి వచ్చాడు షాడో.

"తాతా...మీకు శ్రమ యిచ్చినందుకు చాలా బాధపడుతున్నాను. నీ మాట నువ్వు నిలబెట్టుకున్నావ్. యిక నామాటనేను నిలబెట్టుకుంటాను. తలుపువైపు అడుగులువేస్తూ, వాలెట్ తీశాడు. వందరూపాయల కాగితాన్ని పడుచుపిల్ల మీదికి విసురుతూ.."కొత్తచీరె కొనుక్కో.. అనవసరంగా నిన్ను భయపెట్టినందుకు ...నేను యిచ్చుకుంటున్న పరిహారం అది" అని తలుపు తెరిచాడు.

"అయ్యా... అయ్యా!" అంటున్నాడు వృద్ధుడు ఆశ్చర్యం నిండిన కంఠంతో షాడో ఆ మాటలువిని పించుకోలేదు. చల్లగా బయటికివచ్చి, తోటలో కాలు పెట్టాడు.

ప్రహరీ యింకో పది అడుగులువుంది అనగా ఒక వ్యక్తి గమనించాడు. అతని అరుపులు విని అందరూ షాడోని

చుట్టుముట్టడానికి ప్రయత్నించారు.

గాలిని చీల్చుకుంటూ షాడో తల ప్రక్కనుంచి దూసుకుపోయాయి పది బాకులు. రెండు రివాల్వర్లు – ధన్ మని మోగాయి. వాటి శబ్దంతో దద్దరిల్లి పోయిందా ప్రదేశం.

జిగ్ జాగ్ గా పరిగెత్తుతూ... ఆ ఆయుధాల బారినుంచి తప్పించుకున్నాడు. ప్రహరీ సమీపించి ఎగిరి అవతలకు దూకాడు.

షిక్కా అనుచరులుచుట్టూ తిరిగి వచ్చేసరికి ఆ ప్రదేశంలో లేకుండా చీకట్లలో కలిసిపోయాడు.

***

స్టీమర్ సలీమా భారత్ షిప్పింగ్ కార్పోరేషన్ కు చెందిన ప్రయాణీకుల ఓడ. అరేబియా సముద్రంలో తిరుగుతూ వుంటుంది. భారతదేశం నుంచి సరుకులను మనుష్యులను అరేబియా ఆఫ్రికా దేశాలకు చేరుస్తూ వుంటుంది.

'రాజూ!' అనే పేరుతో పోర్ట్ సయ్యద్ కి టిక్కెట్ సంపాదించాడు షాడో. షిక్కా భవంతిలో విక్టర్ జాడలు తెలుసుకున్న రెండు రోజుల వరకూ హార్బర్ కి సమీపంలో వున్న చిన్న హోటల్ లోనే గడిపాడు. బయటికి రాకుండా,

కావాల్సిన పనులన్నీ హోటల్ బాయ్ చేత చేయించుకుంటూ ఎవరికంటా పడకుండా సంచరించాడు.

ఎనిమిదవ తారీకున సాయంత్రం నాలుగు గంటలకు ప్రయాణం ప్రారంభించింది స్టీమర్ సలీమా.

టిక్కెట్లు కలెక్ట్ చేసే అధికారికి తన టిక్కెట్ చూపించి నౌక మీదికి అడుగుపెట్టాడు షాడో, నౌక యింకో పది నిముషాలకు కదులుతుందనగా ఒక యువతి ఆదరాబాదరాగా వచ్చినౌకా ప్రవేశం చేసింది.

ఆమె వెనుకే లావాటి మధ్య వయస్కుడొకడు నాలుగు సూట్ కేస్ లు, నాలుగు ఎయిర్ బాగ్ లు పట్టుకొని వచ్చాడు.

ఆ సమయంలో డెక్ చివరిభాగంలో అమర్చబడి వున్న యినుప చువ్వలను ఆనుకొని నిలబడివున్నాడు షాడో. అతనితో పాటు మరికొంతమంది ప్రయాణీకులు అలాగే నిలుచుని వున్నారు.

నౌక బయలుదేరబోతున్నదనటానికి హెచ్చరికగా పెద్దగా సైరన్ మోగింది. అదే సమయంలో ఖరీదయిన సిల్కుబట్టలు ధరించిన యువకుడొకడు గబగబా

ఓడమీదికి వచ్చాడు.

టిక్కెట్ చూపించి లోపలకు వెళ్ళబోతున్న ఆ యువతి చేయిపట్టుకొని నిలబెట్టాడు.

అతని చేయి విదిలించి కొట్టిందామె. "నీకు లక్షసార్లు చెప్పాను. ఇప్పుడు ఆఖరిసారిగా హెచ్చరిస్తున్నాను. మర్యాదగా వెళ్ళిపో. నా పరువులు తీయటానికి ప్రయత్నించకు" కోపంగా అన్నది.

లోగొంతుకతో ఏమేమో చెప్పసాగాడా యువకుడు. అతని మాటలు వినిపించుకోలేదామె.

అసహ్యంగా నౌకాధికారివైపు తిరిగింది. "సార్... దయచేసి యితన్ని వెళ్ళిపొమ్మని చెప్పండి. మర్యాదగా వెళ్ళకపోతే మెడపట్టుకొని క్రిందికి నెట్టండి." అని ప్రార్థించింది.

నౌకాధికారి ఏం చెప్పాలో తెలియక వింత చూస్తున్న ప్రయాణికులవైపు చూశాడు. ఓడ మరొకసారి కూత బెట్టింది. వడ్డుకు ఆనించివేసిన యినుప నిచ్చెన పైకి లేవటం ప్రారంభించింది.

"జుబేదా! ఆఖరిసారిగా అడుగుతున్నాను. నన్ను పెళ్లి

చేసుకొని యిక్కడే వుండిపో!" దీనంగా వేడుకున్నాడా యువకుడు.

వినిపించుకోలేదు జుబేదా. తల ప్రక్కకు తిప్పుకొని నిలబడింది.

ఇనుప నిచ్చెన నేలకు రెండు అడుగుల ఎత్తుకు లేచింది. ఖంగారుగా ఓడదిగి వడ్డుమీదికి పరుగుతీశాడా యువకుడు.

ఆఖరిసారిగా పెద్దగా సైరన్ మ్రోగింది ముందుకు కదిలింది స్టీమర్ సలీమా.

జూబేదా అనబడే ఆ యువతి తనతో వచ్చిన మధ్య వయస్కుడు వెంటరాగా తనకు ఎలాట్ చేసిన కాబిన్ వైపు బయలుదేరింది.

పచ్చటి దేహచ్ఛాయ ఆమెది. రూపెత్తిన సౌందర్య దేవతలా కనిపిస్తోంది. "పాపం.. ప్రేమలో ప్రమాదం కాబోలు!" షాడో పక్కన నిలబడిన ఒక ప్రయాణికుడు కామెంట్ చేసాడు.

ఆమె వంకే చూస్తున్న షాడో తలవూపాడు. అతనిముందు నుంచే వెళ్ళిందామె. పోతూపోతూ

భుజంమీది నుంచి షాడోవైపు చూస్తూ వెళ్ళింది. ఆ చూపును గమనించాడు షాడో. అప్రయత్నంగా తనలోతనే నవ్వుకున్నాడు.

తన లెక్క సరి అయితే.. తెల్లవారి పదిగంటలు కొట్టే లోపుగా ఆమెతో పరిచయం అవ్వాలి. అవుతుంది.

తీరాన్ని వదిలి సముద్ర మధ్యంలోకి అడుగుబెట్టింది సలీమా. చల్లటి గాలి వీచసాగింది. మెల్లిగా పటమటి దిక్కున సంధ్యాకాంతులు ప్రత్యక్షమయ్యాయి. మరికొంత సేపటికి చీకట్లు సముద్రాన్ని చుట్టుముట్టాయి.

తన కాబిన్ కి తిరిగి వెళ్ళిబంక్ మీద మేనువాల్చాడు. షాడో కనులనిండా జుబేదా రూపమే నిండి వుంది. ఆమె తన కాబిన్ కి పోతూ– విసిరిపోయిన చూపే మాటిమాటికి జ్ఞాపకం వస్తున్నది.

అరగంట సేపు అవస్థలుపడి ఆ తరువాత మెల్లిగా నిద్రలోకి జారిపోయాడు.

***

ఉదయం పదిగంటల సమయం, డెక్ మీద వంటరిగా నిలబడి సముద్రపు సౌందర్యాలను పరికిస్తున్నాడు షాడో.

వెనుక అడుగుల చప్పుడు వినిపించేసరికి – గిరుక్కున అటు తిరిగి చూశాడు . పది అడుగుల దూరంలో వుంది. ఆ యువతి. ఒక యినుపస్థంభానికి ఆనుకొని విలాసంగా నిలబడి వుంది.

సముద్రంమీదనుంచి గాలి తెరలు తెరలుగా వస్తున్నది ఆమె ముంగురులు ముఖంమీదికి చెదిరి చిరునాట్యం చేస్తున్నాయా గాలిపాటుకు. “హల్లో !మైనేమ్ యీజా రాజు!” అన్నాడు. షాడో స్మార్ట్ గా శాల్యూట్ చేస్తూ.

బుగ్గలు సొట్టలు పడేలా నవ్విందామె. “నాపేరు జుబేదా....పోర్ట్ సయ్యద్ వరకూ ప్రయాణం చేస్తున్నాను” అనిచెప్పింది.

ఆఖరిమాటలు వుచ్ఛరించే తీరు షాడోకి వినోదం కలిగించింది.

నవ్వుతూ చుట్టూ చూశాడు. పదినిముషాలపాటు వారిద్దరి మధ్య గంభీరమైన నిశబ్దం రాజ్యం ఏలింది.

ఉన్నట్లుండి ఆమెవంక చూశాడు షాడో. అంతవరకూ అతన్నే చూస్తున్న జుబేదా చక్కున చూపులు మరల్చుకుంది.

"వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వున్నది." సంభాషణ ప్రారంభించాడు షాడో.

మౌనంగా తలువూపి అతనితో ఏకీభవించిందామె.

ఆమెను మాటల్లోకి దించాలని అభిలషించాడు షాడో అందుకు తగిన టాపిక్ దొరకటం చాలా కష్టమైపోయింది.

ఉన్నట్లుండి... "వస్తాను.. కొంచెం పనివుంది..." అంటూ అతని ముందు నుంచి వెళ్ళిపోయింది జుబేదా.

గుప్పుమంటూ వచ్చింది అత్తరువాసన. గాలి వాలున షాడో చుట్టూ అలుముకుంది.

ఆమెతో మాటలు పెంచుకోలేని తన అసమర్ధతకు తనను తానే నిందించుకుంటున్న షాడో ఒక్కసారిగా వులిక్కిపడ్డాడు.

ఎక్కడో – అటువంటి అత్తరువాసనను ఆఘ్రాణించాడు తను ఎక్కడ?

పనామా వెలిగించుకుంటూ తన గదికి చేరుకున్నాడు. ఎంత ఆలోచించినా ఆ సెంట్ ని ఎక్కడ చూశాడో అతనికి గుర్తుకు రాలేదు.

కులకర్ణిగారి సెక్రటరీ సులోచన కూడా అటువంటి పేర్

ఫ్యూమ్ నే వాడుతుంది. కాని ఇది యింత ఘాటుగా వుండదు.

సి.ఐ.బి రిసెప్షనిస్టు బెట్టీ– ఫ్రెంచి పెర్ ఫ్యూమ్ యూజ్ చేస్తుంది బిందు – బిందును తలచుకోగానే నవ్వు వచ్చి పక్కమీద నుంచి లేచాడు షాడో.

బిందు అత్తర్లను ఉపయోగించదు మల్లెపూలు, సంపెంగలు, గులాబీలు కనపడితే అవన్నీ కట్టగట్టి పైనుంచి క్రిందిదాకా అలంకరించుకునే దాకా నిలువదు. మరొకర్ని నిలువనీయదు. లేదు. ఇదేదో– చాలా విచిత్రమైన పరిస్థితుల్లో తను అనుభవించిన వాసన. అందుకే జ్ఞాపకం రావటంలేదు.

జుబేదాతో మరో పదినిముషాలు గడిపితే గుర్తుకు రావచ్చు.

***

స్టీమర్ సలీమా అరేబియన్ సముద్ర మధ్యంలోకి అడుగు పెట్టిన రెండవ రోజున తుఫాన్ లో చిక్కుకుంది.

ఉన్నట్లుండి భయంకరమైన యీదురుగాలి ప్రారంభమయింది. అలలు నిలువెత్తున ఎగిసిపడుతూ–

ఓడను ఎత్తి ఎత్తివిసిరికొట్టటం ప్రారంభించాయి.

సముద్ర ప్రయాణాలు అలవాటు– లేని వారందరూ ఓడ మునిగిపోతుందన్న భయంతో ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకొని కూర్చున్నారు.

కాబిన్ లోనే కాలం గడుపుతున్నాడు షాడో. డెక్ మీదికి వెళ్ళే అవకాశంలేక.

మూడవరోజు సాయం సమయంలో కాబిన్ తలుపుతట్టిన శబ్దం విని "ఎవరది?" అంటూ లేచాడు.

జుబేదా సేవకుడైన మధ్యవయస్కుడు కారిడార్ లో నిలబడి వున్నాడు. "సార్... అమ్మచాలా భయపడుతున్నది సార్... మీరొకసారివచ్చి చూడాలి..." అన్నాడు విషాదంగా ముఖంపెట్టి .

నవ్వుకుంటూ అనుసరించాడు షాడో.

నిజమే నిజంగానే భయపడుతున్నది జబేదా ! చచ్చిపోతానేమో అన్న భయంతో గిజగిజలాడుతున్నది.

ఆమెను సమీపించి ధైర్యం చెప్పాడు. బయట నిలబడిన సేవకుడు తలుపులు దగ్గిరికివేసి పక్కకు తప్పుకున్నాడు.

ఆ తరువాత ఏం జరిగిందో షాడోకు అంతగా గుర్తు లేకపోయింది. తనుజుబేదాను కౌగలించుకున్నాడా ఆమె తనను వశపరుచుకుందా? ఏది ఏమైనా తెల్లవారేవరకూ యిద్దరికీ ఆ విషయాన్ని గురించి అంతా ఆలోచించే తీరిక లేకపోయింది.

తరువాత – తెల్లవారిన తరువాత అలసిసొలసి నిద్రిస్తున్న జుబేదాను వదిలి తన గదికి తిరిగివస్తూ, ఆసెంటువాసన ఎక్కడ చూశాడో గుర్తుకుతెచ్చుకున్నాడు షాడో.

షిక్కా ఎత్తు ఎత్తాడు – ఎరగా జుబేదాను పంపించాడు. అయితే ఎప్పుడూ ఒకేరకమైన సెంటుని వాడటం చాలా ప్రమాదమని ఆమెకు తెలియదు.

ఆరోజు గులాబీలను అలంకరిస్తూ షాడో జుబేదాను గుర్తుపెట్టుకున్నాడని షిక్కా గ్రహించే అవకాశంలేదు.

ఎప్పుడో ఏమరిపాటుగా వున్న సమయంలో వలవిసురుతుంది జుబేదా. కనిపెట్టుకొని వుండకపోతే ముప్పుతప్పదు.

***

మూడు రోజులు మూడు క్షణాలుగా గడిచిపోయాయి. మరునాడు పోర్ట్‌సయ్యద్ దృష్టి పథంలోకి వస్తుందని అనగా – ఆరాత్రి షాడోనువిసిగించివేధించింది జుబేదా.

ఆమె ముఖంలో విషాద వలయాలు పరిభ్రమిస్తూ వుండటం గమనించాడు షాడో. అదే తామిద్దరూ ఆఖరిసారిగా కలుసుకోవటం అన్నట్లు ప్రవర్తించటం పరికించాడు.

తను ఎదురుచూస్తున్న క్షణం దగ్గిరలోకి వచ్చిందని గ్రహించాడు.

కాని తెల్లవారుఝాము వరకూ సయ్యాటలాడిన జుబేదా అలసిపోయిమాగన్ను పెట్టింది.

నిశబ్దంగా లేచాడు షాడో. తన కాబిన్ కి తిరిగి వచ్చాడు. పగలు ప్రయాణీకుల మధ్య ఆమె ఎటువంటి ప్రయత్నమూ చేయదు.

వంటరిగా వుండే అవకాశం యివ్వలేదు.

ఆఆలోచనలతో సతమతమౌతూ... యధాలాపంగా కాబిన్ తలుపు తెరిచాడు.

మరుక్షణం నల్లటి ముసుగుధరించిన ఆకారం ఒకటి అతనిమీదికి లంఘించింది.

గిరుక్కున పక్కకు తిరిగి క్రిందపడ్డాడు షాడో. ఆ ఆకారపు చేతిలోవున్న కత్తిపోటును తప్పించుకున్నాడు. క్రిందపడిన షాడోమీదికి దూకిందా ఆకారం.

కాలుమడిచి మోకాలుమీద తన్నాడు షాడో. స్ప్రింగులా లేచి చేయివిసిరాడు.

ఆఆకారపు చేతిలోకత్తి ఎగిరిపోయింది. వెంటనే కారిడార్ చివరికి పరుగుతీసి మాయమైపోయిందది.

ఆ గల్లంతువిన్న ప్రయాణీకులు కొంతమంది అటుకేసి వచ్చారు. అనుసరిద్దామా వద్దా అని ఆలోచిస్తున్న షాడో– ఆ ఆలోచనను విరమించుకొని కాబిన్ లోకి వెళ్ళిపోయాడు.

పోర్టు సమీపంలోకి వచ్చినట్లు హెచ్చరికగా అలారం గింగురు మంటూ వినవచ్చింది. అదే సమయంలో.

***

సూర్యుడు పటమటిదిక్కుకు మరలుతున్న సమయంలో పోర్ట్ సయ్యద్ లో ఆగింది స్టీమర్ 'సలీమా'

ప్రయాణీకులు ఒకరినొకరు తోసుకుంటూ డెక్ మీద

వరుసల్లో నిలబడ్డారు. హార్బర్ అధికారులు, కస్టమ్స్ శాఖ ప్రతినిధులు పాస్ పోర్టులను పరిక్షించటానికి సిద్ధంగా వున్నారు. ఎయిర్ బాగ్ భుజానికి తగిలించుకొని డెక్ మీదికి వచ్చాడు షాడో. హార్బర్ అవతల సయ్యద్ పట్టణం కనిపిస్తోంది. కైరో అక్కడికి మూడువందల మైళ్ళ దూరంవుంది. విక్టర్ ని వెతకాలంటే ఎటువంటి పరిశోధన ప్రారంభించాలో ! అన్న ఆలోచన అతని హృదయాన్ని పట్టి పీడించటం ప్రారంభించింది.

సడన్ గా ఒక వింత సువాసన అతనిచుట్టూ అలుముకున్నది తలతిప్పి చూడనవసరంలేదు. అది జుబేదా వుపయోగించే అత్తరువాసన.

అడుగులో అడుగువేస్తూ వచ్చి షాడో ప్రక్కన నిలబడింది జుబేదా... పదిక్షణాలు మౌనంగా నిలబడి , “రాజూ” అన్నది మెల్లిగా.

తలతిప్పి ప్రశ్నార్ధకంగా చూశాడు షాడో.

“రాజూ... సయ్యద్ పట్టణపు శివార్లలో నాకో యిల్లు వుంది.”

షాడో పిడికిళ్ళు బిగుసుకున్నాయి. ఉబికివస్తున్న

ఆగ్రహాన్ని అతి ప్రయత్నంమీద అణుచుకున్నాడు. జుబేదా...వల విసురుతున్నది!!

"రాజూ... మన పరిచయం, యీ ప్రయాణంతో, అంతం అయిపోతుందని ఆశించాను. కాని... నిన్ను మరిచిపోవటం నాకు సాధ్యపడేటట్లు కనిపించటంలేదు. రాజూ...నాకోరికను చులకనగా చూడక మా యింటికి ఒకసారి వస్తావ్ కదూ?"

మౌనంగా తలవూపాడుషాడో.

జుబేదా ముఖం వికసించింది. ఒక చిన్న కాగితపు వుండను షాడో జేబులో పెట్టి వెనుతిరిగి వెళ్ళిపోయింది.

ప్రయాణీకులు ఒకరి తరువాత ఒకరుగా స్టీమర్ లోనుంచి హార్బరులోకి వెళ్ళసాగారు. జుబేదా కూడా వారితో పాటు వెళ్ళింది.

అందరికంటే ఆఖర్న దిగాడు షాడో.

"యువర్ పాస్ పోర్టు ప్లీజ్" అంటూ చేయి జాపాడు ఒక కస్టమ్స్ అధికారి. వాలెట్ తీశాడు షాడో. అందులో వున్న బంగారు పతకాన్ని చూడగానే ఆ అధికారి ప్రవర్తనలో మార్పు వచ్చింది.

"వెరీగుడ్ సార్... మీరు ఎందుకు వచ్చారో మాకు తెలియదు. కాని అదేదో మాకు మంచి జరిగే పనే అని ఆశిస్తాను. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్ సార్." అన్నాడు.

హార్బరు దాటి, కనిపించిన మొదటి హోటల్లో ఒక రూం తీసుకున్నాడు షాడో. తలుపు గడియపెట్టి మంచంమీద కూర్చుంటూ జుబేదా యిచ్చిన కాగితపు వుండను బయటికి తీశాడు.

"ప్రియతమా!" అని ప్రారంభించింది జుబేదా... షాడో పెదిమల మీద సన్నటి చిరునవ్వొకటి ప్రత్యక్షమయింది.

"ప్రియతమ! సిరాజుద్దీన్ లేన్ లో ఇరవై నాలుగువ నెంబర్ మేడనాది. మేడముందు రెండు ఖర్జూర వృక్షాలు కమిపిస్తాయి. గేటుతీసే వుంచుతాను. సరాసరి లోపలకురావచ్చు. ముందున్న వరండాలో నీకోసం ఎదురుచూస్తూవుంటాను. రాజుడియర్! నీరాకకోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తుంటా. నాఆశ నిరాశ చేయవన్న నమ్మకంతో– నీజుబేదా!"

అగ్గిపుల్ల వెలిగించి ఆచీటీని తగలబెట్టాడు షాడో. ముడిపడిన కనుబొమ్మలతో మసి అయిపోయిన ఆచీటీ

వంకే సాలోచనగా చూశాడు.

***

చీకటి పడింది. సయ్యద్ పట్టణం పదిగంటలుకాక ముందే నిద్దురలోకి జారిపోయింది.

పనామా కాలుస్తూ కిటికీ దగ్గిర పచార్లు చేస్తున్నాడు షాడో. వీధిలో జనసంచారం పలుచబడటం గమనించి వెనుతిరిగాడు.

రివాల్వర్ ని జాగ్రత్తగా క్లీన్ చేసి బెల్టు వెనుక దాచాడు. డాగర్ మొనను శుభ్రంగా తుడిచి బూటుకు పక్కగా వున్న అరలో దోపాడు.

క్రింది అంతస్థులోవున్న రిసెప్షనిస్టు. నిద్రకళ్ళతో చూశాడు ఏమిటన్నట్లు.

"సిరాజుద్దీన్ లేన్ ఎక్కడవుందో చెప్పగలరా?" అడిగాడు షాడో.

వివరంగా టేబిల్ మీద గీతలుగీసి చెప్పాడతను.

"థేంక్స్ వెరీమచ్..." అంటూ బయటికివచ్చాడు షాడో.

అతను బసచేసిన హోటల్ కి మైలు దూరంలోవున్నది

జుబేదా చెప్పిన మేడ.

ఇరవైమూడవ నెంబర్ గల మేడతో సిరాజుద్దీన్ లేన్ అంతమైపోయింది. జుబేదా వివరించిన భవనం... మిగిలిన భవంతులకు దూరంగా... వంటరిగా నిలబడివుంది.

ఒకచెట్టుక్రింద నిలబడి ఆభవనంవంక పరిశీలనగా చూశాడు షాడో. ఖర్జూర వృక్షాలు క్లియర్ గానే కనిపిస్తున్నాయి.

ప్రహరీ చుట్టూ మోకాలి ఎత్తున ముళ్ళపొదలు పిచ్చిచెట్లు పెరిగివున్నాయి.

అడుగులో అడుగువేస్తూ అటుకదిలాడు షాడో. పావుగంట తరువాత భవంతిని సమీపించి ప్రహరీ ప్రక్కగా నిలబడ్డాడు.

అంతా నిశ్శబ్దంగా వుంది. భవంతిలోనుంచి ఎటువంటి కదలికా కనిపించటంలేదు. మనుషులు వున్న అలికిడి కూడా వినిపించటంలేదు.

అయినా ముందుకు పోవటానికి మనస్కరించక, ఆవరణ పక్కనే నిలబడ్డాడు. కన్ను పొడుచుకున్నా కానరాని ఆచీకటిలో – ఏదో ప్రమాదం పొంచి వుందని అతని సిక్స్త్

సెన్స్ హెచ్చరించసాగింది.

అరగంట తరువాత ఆ హెచ్చరిక యదార్థమని ఋజువయింది. భవనంముందున్న వరండాలో బూటుకాలు కదిలిన శబ్దం. లీలగా షాడో చెవులకు సోకింది.

"టైమ్ ఎంత అయింది?" స్వచ్ఛమైన భాషలో అడిగిందొక కంఠం.

"పదకొండు దాటింది"

"ఇంకా ఎంతసేపు యిలా పడిగాపులు పడాలి?"

"వస్తాడు... తెల్లవారేలోపుగా వచ్చి తీరతాడు. అతను వచ్చేవరకూ వెయిట్ చేయమని మనకు ఆర్డర్ యివ్వబడింది."

"ఒకవేళ రాకపోతే?"

"రాకపోవటంఅంటూ జరగదని జుబేదా చెప్పింది. జుబేదా మీద మనసుపడిన మగవాడు, ఆమె రమ్మని పిలిచిన తరువాత రాకుండాపోవటం నేను యింతవరకూ చూడలేదు"

షాడో నరాల్లోకి రక్తం వేడిగాప్రవహించటం ప్రారంభించింది. "సో...జుబేదా వలవిసిరిందన్నమాట!

యిద్దరు హంతకుల్ని రెడీచేసివుంచి, తనకు యిన్విటేషన్ యిచ్చింది!!"

వారిద్దర్నీ బంధించి మాటాడిస్తే ఎలావుంటుందీ అన్న ఆలోచన షాడో హృదయంలో అడుగుపెట్టింది.

వెంటనే వెనక్కు జరిగాడు. ఒక ఖర్జూర వృక్షాన్ని అడ్డుపెట్టుకొని ప్రహరీదాటాడు. నిశబ్దంగా పాములాగా జరిగి భవనాన్ని సమీపించాడు.

మూడు అడుగుల ఎత్తున్నాయి మెట్లు. రెండు మెట్లు ఎక్కి వరండాలోపలికి చూశాడు. చీకటిలో చూడటానికి అలవాటు పడిన అతని నేత్రాలకు కుర్చీలో కూర్చుని వున్న యిద్దరు దృఢకాయులు కనిపించారు.

నిశబ్దంగా ఆఖరిమెట్టు ఎక్కి వరండాలోకి జరిగాడు షాడో. ఒక చివరికిపోయి గోడను ఆనుకొని నిలబడ్డాడు.

అదేగోడకు బిగించివుంది. ఎలక్ట్రిక్ లైటు స్విచ్. షాడో చేయిదానిమీద పడింది.

వరండా ఒక్కసారిగా పట్టపగలుగా మారిపోయింది. అదిరిపడి కుర్చీలలో నుంచి లేవటానికి ప్రయత్నించారు ఆవ్యక్తులు యిద్దరూ.

మెరుపులా బెల్టు వెనుకనుంచి రివాల్వర్ ని లాగాడు షాడో. వారికి అతనికీ ఎనిమిది అడుగులదూరం వుంది. వారిద్దరి చేతుల్లోనూ ఖరీదయిన రివాల్వర్లు వున్నాయి. తను ట్రిగ్గర్ నొక్కి ఒకవ్యక్తిని యమసదనానికి పంపించేలోపుగా రెండవవ్యక్తి తనను పైకి పంపించటానికి అవకాశాలు వున్నాయి.

ఏమయితే అది అయింది లెమ్మని అనుకొంటూ మొండిగా నిలబడ్డాడు.

ఆశ్చర్యం నుంచి తేరుకున్నారు వారిద్దరూ. షాడో అనుకున్నట్లుగానే పొజిషన్ అర్థం చేసుకున్నారు. అయితే... ముందు రివాల్వర్ ఎత్తిన మనిషి షాడో బుల్లెట్ కి గురి అవుతాడు. ఆపనిచేసి ప్రాణత్యాగం చేయగల తెంపరితనం వారిద్దరిలోనూ లోపించింది.

రివాల్వరు వారిద్దరికేసి గురిపెట్టివుంచి, ఎడమచేత్తో సిగిరెట్ వెలిగించుకున్నాడు షాడో.

అదే అదునుగా తీసుకుని రివాల్వర్ పైకి ఎత్తాడొక వ్యక్తి. షాడో చేతిలోని లైటర్ జారిక్రిందపడింది. కుడిచేతిలోవున్న రివాల్వరు భయంకరంగా గర్జించింది.

ఆవ్యక్తి ట్రిగ్గర్ నొక్కేలోపుగానే అతని రివాల్వర్ ఎగిరి వరండా చివరకు పోయిపడింది. బుల్లెట్ విరచిమ్మిన నిప్పురవ్వలు చేతిని చురుక్కుమనిపించటంతో కెవ్వున అరిచి చేతిని వెనక్కు దాచుకున్నాడు.

ఆసంఘటన అదునుగా తీసుకొని రివాల్వార్ ని,షాడో వైపుకు గురిపెట్టాడు రెండవవ్యక్తి. అతివేగంగా ముందుకు దూకాడు షాడో. బూటుకాలితో అతని భుజంమీద తన్నాడు.

“యా అల్లా... మరగయా...” అని అరుస్తూ కుర్చీలో నుంచి క్రిందికి దొర్లాడతను. గురిచూసి కణతమీద బలంగా తన్నాడుషాడో. కదలటానికి ప్రయత్నించిన కుర్చీలోని మనిషి నెత్తిమీది రివాల్వర్ మడమతో గట్టిగా మోదాడు.

ఒకేసారి జరిగిపోయాయా రెండుపనులూ. ఒకేసారి పెద్దగా అరిచి ఒక్కసారిగానే స్పృహ తప్పిపడిపోయారు వారిద్దరూ.

తిరిగి రెండుగంటల తరువాత వారికి స్పృహ వచ్చింది. కనులు తెరిచేసరికి తాము కుర్చీలలో బంధించి కూర్చోపెట్టినట్లు గ్రహించారు.

వరండాగోడకు ఆనుకొని కూర్చున్నాడు షాడో. “ఆల్ రైట్ ఫ్రండ్స్... నాకు కొన్ని విషయాలు అర్థంకాలేదు. నా ప్రశ్నలకు సరిమైన సమాధానాలు యిస్తే బాగుంటుంది” అన్నాడు లేచినిలబడుతూ.

“మా ప్రాణాలు తీసినాసరే... మా నుంచి ఒక్కముక్కగూడా తెలుసుకోలేవు.” మొండిగా సమాధానం యిచ్చాడొక వ్యక్తి.

షాడో కనులలో సి.ఐ.డి. చీఫ్ ఫెర్నాండజ్ యిచ్చిన ఫైలు మెదిలింది. సముద్రంలో కొట్టుకువచ్చిన ప్రీత్‌పాల్ సింగ్ శరీరాన్ని ఫొటోతీసి... ఫైలుచేశారు. కాలర్ బోన్ విరిగి... కత్తిపోట్లతో బాధపడి మరణించాడా సి.ఐ.డి.

షాడో కళ్ళు ఎర్రబడ్డాయి. అరచేతిని అడ్డంతిప్పి ఆమాట అన్నవ్యక్తి భుజంమీద చరిచాడు.

ఫట్ మని శబ్దంతో అతనికాలర్ బోన్ విరిగిపోయింది. రివాల్వర్ ని బెల్టు వెనుకదాచి, బూటులోవున్న డాగర్ ని తీశాడు షాడో.

“బాధగా వుందా? ఏం చేస్తాం.. మన ప్రొఫెషన్ లో యిలాంటివి తప్పనిసరి. నా ప్రశ్నలకు సమాధానాలు

రాకపోతే ఒకటొకటిగా మీ శరీరంలోవున్న ఎముకలన్నిటినీ విరిచేస్తాను. చర్మాన్ని చిట్లగొట్టి ఉప్పుకారం అద్దుతాను" డాగర్ తో అతని ముఖంమీద రాస్తూ మెల్లిగా అన్నాడు షాడో.

చెమటలతో నిండిపోయాయి వారిముఖాలు. కాలర్ బోన్ విరిగిన వ్యక్తి బాధగా మూలగటం ప్రారంభించాడు. ఆ మూలుగులు విన్న అతని సహచరుడు ధైర్యాన్ని కోల్పోయాడు.

జాలి, దయ అనే మాటలు మరిచి పోయినట్లు అతన్నిమరింత భయపెట్టాడు షాడో. అరగంట తరువాత అతని అనుమానాలన్నిటికీ ఆధారాలు లభించాయి. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు యివ్వబడ్డాయి.

డాగర్ ని బూటులోదోపి వారిద్దరి తలలమీద పిడికిలితో గుద్దాడు షాడో. తిరిగి మైకంలో మునిగిపోయారు వారిద్దరూ.

సిగిరెట్ వెలిగించుకొని, తాపీగా పోర్టుసయ్యద్ వేపు ప్రయాణం ప్రారంభించాడు షాడో.

***

పోర్ట్ సయ్యద్ కి పాతికమైళ్ళ దూరంలో సముద్ర మధ్యంలో ఆగివుంది మెహరున్నిసా. వందమంది ప్రయాణంచేయటానికి అన్ని సౌకర్యాలు అందలోవున్నాయి. డెక్ పైభాగంలో మిగిలిన కట్టడాలకు దూరంగా ఒకచిన్న కాబిన్ వుంది. బయటికి అసహ్యంగా కనిపిస్తుంది. లోపల చాలా అందంగా అలంకరించబడి వుంది.

కాబిన్ మధ్యగా పెద్దటేబిల్ వుంది. దానిముందు ఇద్దరు వ్యక్తులు, ఒక స్త్రీ కూర్చుని వున్నారు.

లావుగా – పొట్టిగా ఖరీదయిన దుస్తులుధరించి వున్నాడొక వ్యక్తి, తెల్లనిజుట్టును నీట్ గా వెనక్కిదువ్వుకున్నాడు. కళ్ళకి రిమ్ లెస్ గాగుల్స్ పెట్టుకుని వున్నాడు.

అతనిపేరు సయ్యద్ జమాలుద్దీన్.

అరేబియా దేశాలలో అందరూ అతన్ని సయ్యద్ అనే పిలుస్తారు. ఇండియాలో మాత్రం అతనిపేరు విక్టర్!!

అతని పక్కన వున్న స్త్రీ జుబేదా, ఎందుకో నెర్వస్ గా కనిపిస్తోంది. చేతులు నులుముకుంటూ, కుషన్ ఛైర్ లో అసహనంగా కదులుతున్నది.

ఆమెకు రెండోవైపున కూర్చున్న వ్యక్తికూడా అదే మాదిరిగా ప్రవర్తిస్తున్నాడు. వాచ్ వంక చూసుకుంటూ "ఇంకారాలేదు...ఏమయిందో!!" అన్నాడు.

చిన్నగా నవ్వాడు విక్టర్. "మరేం పరవాలేదు సులేమాన్. ఈసరికి పనిముగించి తిరిగివస్తూవుంటారు. మనం తెల్లవారకముందే ప్రయాణం ప్రారంభించాలి. అందుకు కావాల్సిన ఏర్పాట్లు చూడు" అన్నాడు.

అదే సమయంలో మూసివున్న కాబిన్ డోర్ ఒక్కసారిగా తెరుచుకున్నది. పాలిపోయిన ముఖంతో, ఒక నావికుడు లోపలకు వచ్చి పడ్డాడు.

"నాన్సెన్స్.. ఏమిటీ ఆగడం!! సులేమాన్ వీడిని కొరడాతో–" అంటూ కోపంతో లేచినిలబడ్డాడు విక్టర్.

"క్షమించండి సాబ్ మన్నించండి... నన్ను..నన్ను" అంటూ చేతులు జోడించి కన్నీళ్ళు పాలైనాడు నావికుడు.

అతనివైపు అడుగులు వేసిన సులేమాన్, అదిరిపడి వెనక్కుగెంతాడు. పెద్దనీడ కాబిన్ లోకి ప్రసరించింది. ఆనీడను అనుసరించి లోనికి వచ్చాడు ఒక ఆజానుబాహుడు. దుస్తులన్నీ తడిసి నీరుకారుతున్నాయి.

చేతిలోని రివాల్వర్ ఆకలిగా కాబిన్ లో వున్న వారివైపు నోరుతెరుచుకొని చూడసాగింది.

విక్టర్, సులేమాన్లు రాతిబొమ్మల్లా చలనం లేకుండా నిలబడి పోయారు. జుబేదా కనులు ఆశ్చర్యంతో వెడల్పు అయ్యాయి. నమ్మలేనట్లు అతనివంక చూసింది. ఆకనులలో ప్రతిఫలించిన ద్వంద్వ భావాలను గమనించి చిన్నగా నవ్వాడు ఆజానుబాహుడు.

ఆనవ్వుతో తెలివితెచ్చుకున్నాడు విక్టర్.

"హేట్సాఫ్ మిస్టర్ రాజూ! ఎంతోమంది సి.ఐ.డిలను చూశాను. కాని నీలా ఎఫీషియంట్ గా పనిచేసే వారెవరూ నాకు కనిపించలేదు" అన్నాడు పక్కకుజరుగుతూ.

మెరుపులా రివాల్వర్ ని అటు తిప్పాడు షాడో. టేబిల్ మీదకు పోతున్న విక్టర్ చేయి ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్లు వెంటనే వెనక్కి జరిగింది.

ఎడమచేత్తో కాబిన్ తలుపుమూసి గడియపెట్టాడు షాడో.

"విక్టర్! మీరు చూస్తున్న మనుష్యులు బహుశా రాకపోవచ్చు. వారి ద్వారా నాకు చాలా విషయాలు

తెలిశాయి ఇక నీపని అయిపోయింది. నువ్వు ఉరికంబం ఎక్కేరోజు దగ్గిర పడింది" అన్నాడు గంభీరంగా.

జుబేదా ముందుకు రావటానికి ప్రయత్నించింది. ఎడమ చేత్తో ఆమెను అవతలికి తోశాడు షాడో.

అదేసమయంలో సులేమాన్ పాంటుజేబులో వున్న రైఫిల్ ని బయటకులాగాడు.

గురిచేసే వ్యవధిలేక, కన్ను కదిపితే విక్టర్ ఎదురుతిరిగుతాడు. కనుచివరల నుంచి గురిచూసి రివాల్వర్ ని అటు తిప్పాడు షాడో.

సులేమాన్ వేలు ట్రిగ్గర్ మీదికి చేరబోతున్నది. షాడో రివాల్వర్ భయంకరంగా గర్జించింది.

ఎగిరి కాబిన్ డోర్ కి గుద్దుకొన్నాడు సులేమాన్. చేతిలోని రివాల్వర్ జారిపోయింది. తనుగూడా దానితో పాటు క్రింద పడిపోయాడు.

కెవ్వున అరిచింది జుబేదా. ముందుకు దూకడానికి ప్రయత్నించాడు విక్టర్. సులేమాన్ ని ఖతం చేసిన మరుక్షణం రివాల్వర్ ని అతనివైపు తిప్పి, కర్కశంగా నవ్వాడు షాడో.

"మిస్టర్ రాజూ! ఈ ఓడమీద నా అనుచరులు నలభైమంది వున్నారు. నువ్వు ప్రాణాలతో ఈ ఓడదిగి అవతలికి పోలేవు" పళ్ళు కొరుకుతూ హెచ్చరించాడు విక్టర్.

"ఆమాట నీకు గూడ వర్తిస్తుంది మైడియర్ విక్టర్! నీఅనుచరులను పిలిచి ఓడను హార్బర్ వైపు పోనీయమని చెప్పు. లేకపోతే నిన్ను అంగుళం అంగుళం చొప్పున బుల్లెట్లతో నింపి చంపుతాను" షాడో గంభీరస్వరం ఆకాబిన్ గోడలకు తగిలి ప్రతిధ్వనించింది మరింత గంభీరంగా.

రెండు క్షణాలు ఆలోచించి, టేబుల్ మీద వున్న ఫోన్ ని అందుకున్నాడు విక్టర్. షాడో చెప్పినట్లేఓడను హార్బర్ వైపు కదిలించమని, ఆర్డర్సు యిచ్చాడు.

మరో రెండు క్షణాలతరువాత 'మెహరున్నీసా' మెల్లిగా కదిలి పోర్ట్ సయ్యద్ వైపు ప్రయాణం ప్రారంభించింది.

రివాల్వర్ ని విక్టర్ వైపే గురిపెట్టి వుంచి గోడకు ఆనుకొని నిలబడ్డాడు షాడో. అతని మనస్సులో అనేక రకాల సందేహాలు మొలకెత్తుతున్నాయి.

విక్టర్ కాబిన్ లో జరిగిన గొడవ నావికులకు వినిపించే వుంటుంది. వినిపించి కూడా వారు సహాయం చేయటానికి

రాలేదంటే – ఇటువంటి పరిస్థితులు ఎదురుపడతాయని వారికి తెలుసు అనిపిస్తోంది.

రెండు నిముషాలు గడిచేసరికి షాడో అనుమానం యదార్థరూపాన్ని పొందింది. అతి నెమ్మదిగా, లంకణాలు, బోటులా కదులుతున్నది స్టీమర్. ఆ వేగంతో ప్రయాణిస్తే పోర్ట్ సయ్యద్ కి చేరుకునేసరికి పది పన్నెండుగంటలు పడుతుంది.

పదిగంటలు !! అంతవరకూ విక్టర్ ని కదలకుండా పట్టివుంచగలడా తను? ఆఆలోచన షాడో హృదయంలో అడుగుపెడుతున్న సమయంలోనే పసిగట్టినట్లున్నాడు విక్టర్. కాలుమీద కాలువేసుకొని కూర్చుంటూ చిన్నగా నవ్వాడు.

“పాపం ఎవరిబాధలు వారివి. అవునామిస్టర్ రాజూ!!” అన్నాడు వినోదంగా చూస్తూ. రివాల్వర్ బారెల్ ఎత్తి అతని తలపగలగొట్టాలని అనిపించినా అతి ప్రయత్నంమీద ఆ కోరికను నిగ్రహించుకున్నాడు షాడో.

“అంత ఆలోచన అనవసరం మిస్టర్ రాజూ! ఇంకా కొద్ది సేపట్లో మనం పోర్టుసయ్యద్ చేరుకుంటాం. అక్కడికి

వెళ్ళగానే హార్బరు అధికారులు వచ్చి చూస్తారు. ఆతరువాత –" అంటూ ఆగిపోయాడు విక్టర్.

కనులు చిట్లించి చూశాడు షాడో. నిజమే! పోర్టు సయ్యద్ లో విక్టర్ మీద అభియోగాలేమీ లేవు. వున్నా అందుకు ఆధారాలు లేవు. తను పైనుంచి ఆర్డర్స్ తెప్పించే సరికి కొద్దిపాటి ఆలస్యం అవుతుంది. యీలోపల బురదమట్టలాగా జారిపోతాడు విక్టర్. అందుకు అవకాశాలు చాలా వున్నాయి.

"అనవసరంగా శ్రమపడుతున్నావ్ రాజు! ఇదంతా వట్టి అనవసరపు శ్రమ" మళ్ళీ అన్నాడు విక్టర్.

షాడో అసహనం హద్దులు దాటింది.

"విక్టర్! నిన్ను భారతదేశం తీసుకుపోయి ఉరితాడు నీ మెడచుట్టూ చుట్టుకుంటుంటే చూడాలని ఆశపడుతున్నాను. నన్ను విసిగించి నా మనసు మార్చే ప్రయత్నాలు చెయ్యకు. నీ నేరాలకు శిక్ష, నా చేతుల్లోనే అనుభవిస్తావ్" హెచ్చరించాడు కరుకుగా.

ఆ మాటలతో మౌనం వహించాడు విక్టర్.

సర్దుకుని నిలబడ్డాడు షాడో. మరో పదినిముషాలు

భారంగా గడిచిపోయాయి. పదినిముషాలు గడిచిన మరుక్షణం షాడో ఎదురుచూస్తున్న క్షణంరానే వచ్చింది. అంతవరకు ద్వారం దగ్గిర స్పృహ తప్పిపడిపోయి వున్న నావికుడు చిన్నగా మూలుగుతూ లేచి కూర్చున్నాడు.

ఒకే ఒక క్షణం పాటు అతనివంక చూడకతప్పలేదు. షాడోకనులు తనమీది నుంచి కదిలిన మరుక్షణం మెరుపులా కదిలాడు విక్టర్. కుర్చీలోనుంచి పక్కకు దొర్లిపోయాడు.

లేచినిలబడబోతున్న నావికుడివి బలంగా తన్నాడు షాడో.

గిరుక్కున పక్కకు తిరిగి రివాల్వర్ ని విక్టర్ వైపు గురిపెట్టాడు.

షాడో బూటు కాలునావికుడి గడ్డం క్రింద తగిలింది. గాలిలోకి లేచి...పోయి గోడకు గుద్దుకొని క్రిందపడ్డాడతను..కాని పడుతూ పడుతూ షాడోను కూడా క్రిందపడేశాడు. గడ్డంమీద తగిలిన కాలును అలాగే బిగించి పట్టుకొని బలంగా గుంజాడు.

ట్రిగ్గర్ నొక్కబోతున్నాడు షాడో. క్రిందపడిపోవటంతో

ఆ ప్రయత్నం నెరవేరలేదు.

ఆ కాస్త వ్యవధిని సద్వినియోగ పరుచుకున్నాడు విక్టర్. క్రిందపడుతూనే కుర్చీని కాళ్ళతో షాడో మీదికి తన్నాడు.

మెడకు మెలిచుట్టుకుంటున్ననావికుడి కాళ్ళను తప్పించుకుంటూ రివాల్వర్ ని విక్టర్ వైపు గురిపెట్టటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు షాడో. కుర్చీ చేతికి తగలటంతో రివాల్వర్ ఎగిరి ఆవల పడిపోయింది.

షాడో సహనం నశించి పోయింది. నావికుడి తలనుబలంగా తన్నినేలకుకొట్టిన బంతిలా లేచినిలబడ్డాడు. లేస్తూనే గాలిలోకి జంప్ చేసి తల్లక్రిందులుగా విక్టర్ మీదికి వెళ్ళాడు.

అదే సమయంలో కాబిన్ డోర్ తెరుచుకుంది. నలుగురు దృఢకాయులు ఆయుధాలు ధరించి లోనికి వచ్చారు.

విక్టర్ మెడపట్టుకొని ప్రాణాలుతీసే కరాటే దెబ్బ వేయటానికి సిద్ధంగా వున్నాడు షాడో. లోపలికి వచ్చినవారిని గమనించాడు కనుచివరల నుంచి.

అంతవరకూ మౌనంగా ఒక చివరగా కూర్చునివుంది జుబేదా... అదిగమనించి చేతికి అందిన కాండిల్ స్టిక్ తో షాడో తలమీద బలంగా మోదింది.

షాడో కళ్ళముందు నక్షత్రాలు మెరిశాయి. స్పృహతప్పబోతున్న ఆఖరిక్షణంలో జుబేదా ఆఖరికి తన కక్ష తీర్చుకున్నదని గ్రహించి– నేలవాలిపోయాడు.

లోపలికి వచ్చిన వారిలో ఒకవ్యక్తి రివాల్వర్ ని షాడో తలకేసి గురిపెట్టాడు.

"నో...నో..."అని అరుస్తూ అతనికి అడ్డం వెళ్ళింది జుబేదా.

"ఆ పని చేయవలసింది మీరుకాదు. ఇంత గొడవ చేసినందుకు క్షణంలోమరణాన్ని పొందితే యితని పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు. విక్టర్ చేతిలో చిత్రహింసలు పొంది మరణించాలి." అన్నది.

మెడ సవరించుకుంటూ లేచినిలబడ్డాడు విక్టర్.

"శహభాష్ జుబేదా! చక్కగా చెప్పావు. ఈ దుర్మార్గుడికి రివాల్వర్ తో మరణం ప్రాప్తించకూడదు..." అంటూ అనుచరులకు సైగ చేశాడు.

పడిపోయిన షాడోజుట్టుపట్టుకొని లేవదీసి నిలబెట్టారు వారు.

"థాంక్యూ జుబేదా.. యిక నువ్వు నీ గదికి వెళ్ళటం మంచిది. ఇకముందు జరగబోయే విషయాలు నువ్వు చూడకుంటా వుండటమే మంచిది." జుబేదాతో అన్నాడు విక్టర్.

పాలిపోయినముఖంతో, షాడోవంక దీనంగా చూస్తూ బయటికి వెళ్ళిపోయిందామె.

పిడికిలి బిగించి షాడో పొత్తికడుపుమీద గుద్దాడు విక్టర్. స్పృహ లేకుండా నిలబడిన షాడో చలించలేదు.

అసహ్యంగా చూసి అనుచరులకు సైగ చేశాడు విక్టర్.

"తీసుకుపోండి. తీసుకుపోయి డెక్ రూంలో బంధించండి. తెల్లవారిన తరువాత ఏం చేయాలో ఆలోచిద్దాం. ఓడను పగడపు పర్వతాలవైపు త్రిప్పండి." అంటూ ఆర్డర్స్ పాస్ చేశాడు.

షాడోను యీడ్చుకుంటూ డెక్ రూమ్ వైపు తీసుకుపోయారు అతని అనుచరులు.

పోర్ట్ సయ్యద్ వైపు కదులుతున్న మెహరున్నీసా

పక్కకు తిరిగి పగడాల పర్వత పంక్తివైపు ప్రయాణం ప్రారంభించింది.

***

తలమీద ఎవరో బండరాళ్ళతో బాదుతున్నట్లు అనిపించి కనులు తెరిచాడు షాడో. శరీరమంతా ఏ అవయవానికి ఆ అవయవం విరిగి పోతున్నట్లు సలుపు పెడుతున్నది.

డెక్ రూమ్ లో ఆవరించుకొని వున్న అంధకారానికి కనులు అలవాటుపడిన తరువాత మెల్లిగా లేచికూర్చున్నాడు. రివాల్వర్ లేదు. బూటులోని డాగర్ ని వశపరుచుకున్నారు విక్టర్ అనుచరులు.

ఆ యినుప బందిఖానా నుంచి బయటపడే మార్గంకోసం అన్వేషిస్తూ లేచినిలబడ్డాడు. పడిపోతుండగా జుబేదా కొట్టిన దెబ్బ జ్ఞాపకం వచ్చి అప్రయత్నంగా పళ్ళు కొరికాడు. తప్పించుకున్న తరువాత ఆమె సంగతి ఆలోచించాలి.

ఆమాట అనుకోగానే అతని అవయవాలకు నూతన శక్తి వచ్చింది. గోడలను తడుముతూ ముందుకు

అడుగువేశాడు.

ఉన్నట్లుండి చేయి మెత్తటి పదార్ధం మీదపడింది. అదిరపడి చేతిని వెనక్కు లాక్కున్నాడు. అదే సమయంలో ఒక వికృత శబ్దం ఆ గదిలో ప్రతిధ్వనించింది.

శరీరం జలదరిస్తుండగా ఎగిరి వెనక్కు దూకాడు షాడో.

"ఒ హ్హో హ్హో హ్హో!!!" అంటూ మరింత కర్ణకఠోరంగా వినిపించిందానవ్వు. అప్రయత్నంగా డిఫెన్స్ పొజిషన్ లో నిలబడ్డాడు షాడో. చేతులు స్టిఫ్ గా వుంచి మోకాళ్ళు మడిచి కనిపించని ఆశత్రువును ఎదుర్కోవటానికి సిద్ధపడ్డాడు. తిరిగి రెండు నిముషాలపాటు గంభీరమైన నిశ్శబ్దం ఆ గది నిండా ఆవరించుకుంది. కళ్ళు చిట్లించి చీకటిలోకి చూశాడుషాడో. తనుకలకంటున్నాడేమో అన్న అనుమానం కలిగింది. రెండు అడుగులు ముందుకువేశాడు. మరొక్కఅడుగు.

మరోసారి వినవచ్చిందా భయంకరమైన నవ్వు.

పళ్ళు బిగువున వెనక్కిదూకాలన్న కోరికను నిగ్రహించుకొని నిలబడ్డాడు షాడో. రెండు అడుగులు

ముందుకు వేశాడు.

కాబిన్ లో ఒక మూల గోడకు వ్రేలాడు దీయబడి వుందొక ఆకారం. నగ్నంగావుంది. వంటిమీద కత్తిగాట్లు, కొరడావాతలు క్లియర్ గా కనిపిస్తున్నాయి. రక్తం ఎండి చారికలుకట్టి దుర్వాసన వెలువడుతున్నది.

గుంటలు పడ్డ కనులతో– కనుగుడ్లను గుండ్రంగా తిప్పుతూ – పగిలి వాచిపోయిన వెదిమలతో – భయంకరంగా నవ్వుతున్నది ఆఆకారం.

కాళ్ళు చేతులు గోడలకున్న మేకులకేసి దృఢంగా బంధింపబడి వున్నాయి.

గుండె దిటవు పరుచుకొని ఆ ఆకారానికి మరింత దగ్గిరికి పోయాడు షాడో. ముఖంలో ముఖంపెట్టి పరిక్షగా చూశాడు.

ఫెర్నాండెజ్ యిచ్చిన ఫైలులో – నాలుగు మాసాల క్రితం ఒక సి.ఐ.డి. అయిపూ అంతూ లేకుండా మాయమై పోయినట్లు వ్రాయబడి వుంది.

మాయమైపోయిన ఆ సి.ఐ.డి. షాడో ఎదురుగా వున్నాడు. చిత్రహింసలు భరించి, భరించి మతిచెడి

పిచ్చివాడై పోయి వున్నాడు.

షాడోకళ్ళు చెమ్మగిల్లాయి. పిడికిళ్ళు బిగించి పళ్ళు కొరికాడు. విక్టర్ నొసటి మీద మృత్యువు రాసిపెట్టివుంది. ఆ రోజుయింకెంతో దూరంలేదు.

"జనార్ధన్! జనార్ధన్!!" అని అతన్నిపేరుపెట్టి పిలిచాడు.

కళ్ళుమూసుకున్నాడా పిచ్చివాడు.

"జనార్ధన్! ఏమయింది? ఎందుకిలా తయారయ్యావ్! ఎవరీపని చేసింది! మరింత గట్టిగా అడిగాడు షాడో."

"హ్హా హ్హా హ్హా హ్హో హ్హో హ్హో!" పిచ్చివాడి నవ్వుతో దద్దరిల్లిపోయిందాగది. షాడో శరీరం గగుర్పొడిచింది. చల్లగా వెనక్కు జరిగి కాబిన్ రెండో ప్రక్కకు పోయి కూర్చున్నాడు.

నవ్వుతూనే వున్నాడతను. ఆ నవ్వుకు అంతూపొంతూ లేకుండా పోయింది.

వినలేక రెండుచేతులతో చెవులు మూసుకున్నాడు షాడో.

***

"జనార్ధన్ ద్వారా మనకేమీ తెలియలేదు. సి.ఐ.డి.లకు మన విషయాలు ఎంతవరకూ తెలుసో మనకు తెలియదు. బహుశా యీ రాజుద్వారా అది బయటపడవచ్చు" డెక్ మీద నిలబడి వున్న విక్టర్ తో అన్నాడొక అనుచరుడు.

రెండు నిముషాలు ఆలోచించి తలవూపాడు విక్టర్. డెక్ మీద ఒక స్తంభానికి వేలాడుతున్న కొరడాను అందుకొని డెక్ రూమ్ వైపు అడుగులు వేశాడు.

పెద్దతాళం తగిలించి వుందా గదికి . యిద్దరు అనుచరులు రైఫిల్స్ పట్టుకొని గదిముందు నిలబడి వున్నారు.

విక్టర్ ని చూడగానే తాళం తీశాడొక అనుచరుడు.

లోపలికి వెళ్లి ద్వారబంధం మీద అమర్చివున్న స్విచ్ ని నొక్కాడు విక్టర్. ఒక్కసారిగా గది కాంతివంతం అయింది.

ఉలిక్కిపడి లేచినిలబడ్డాడు షాడో. ద్వారంలో నిలబడివున్న విక్టర్ ని చూడగానే పిడికిళ్ళు బిగించి ముందుకు వచ్చాడు.

ఛళ్ మని విక్టర్ చేతిలోని కొరడా షాడో గుండెలమీద

షర్టు చిరిగి పీలకలయింది. వంటిమీద ఎర్రటి వాత ప్రత్యక్ష మయింది.

విక్టర్ వెనుక వున్న అనుచరులు షాడో చేతులు వెనక్కి విరిచి పట్టుకున్నాడు. కొరడా గాలిలో ఝుళిపించి పెద్దగా నవ్వాడు విక్టర్.

“నీ సహచరుడు రాజూ– జనార్ధన్ అనిపేరు... బహూశా మీ ఇద్దరికి ఇంకా పరిచయం కాలేదు కాబోలు!!”

సమాధానంగా భయంకరంగా నవ్వాడు జనార్ధన్.

“నాలుగు నెలల క్రితం మెహరున్నీసాను అనుమానించి పరీక్షించటానికి వచ్చాడు.కాలం కలిసిరాలేదు. పట్టుబడిపోయాడు. మూడే మూడు రోజులు రాజూ! చూడు ఎలా తయారైనాడో!! అతని మాదిరిగా తయారవదలుచుకుంటే నా ప్రశ్నలకు సమాధానాలు యివ్వకు. సముద్రంలో సజీవ సమాధి అవ్వాలని వుందా? బుల్లెట్లతో శరీరంలోని రక్తమంతా యింకి పోయి మరణించాలని వుందా? యు జస్ట్ చూజ్ యువర్ వే ఆఫ్ డెత్. అంతా నీ యిష్టం. నీకు ఏది యిష్టమైతే అలా చేస్తాం.”

ఆలోచిస్తున్నట్లు రెండుక్షణాలు సీరియస్ గా ముఖం పెట్టాడు షాడో. వినవచ్చే సమాధానం కోసం ఎదురుచూశాడు విక్టర్.

"గోటు హెల్" అన్నాడు షాడో.

విక్టర్ చేయి గాలిలోకి లేచింది. పళ్ళు కొరుకుతూ బలంగా కొరడాను విదిలించాడు. షాడో శరీరం మీద చర్మం పొంగిపోయింది. బాధ అతని నరాన్ని పిండి వేయటం ప్రారంభించింది.

"రాజు! యింకో నాలుగు గంటలు వ్యవధియిస్తున్నాను బాగా ఆలోచించుకో." అంటూ బయటికి వెళ్ళిపోయాడు విక్టర్.

అతని అనుచరులు షాడో మీద కలబడ్డారు. చిత్తుచిత్తుగా కొట్టి చేతులు వెనక్కివిరిచి కట్టి తలుపుతాళం వేశారు.

ముందుకువస్తున్న మైకపు తెరలను దూరంగా వుంచటానికి విఫల ప్రయత్నం చెయ్యసాగాడు షాడో.

బయట పడలేని పొజిషన్ లో చిక్కుపడినట్లు తెలుస్తూనే వుంది. వెంటనే తప్పించుకోవాలి. లేకపోతే మళ్ళీ

వస్తాడు విక్టర్ ఈసారి సామాన్యమైన దెబ్బలతో వెనుతిరగడు జనార్ధన్ కి పట్టిన గతి తనకు కూడా పట్టించి పోతాడు.

అంతకు ముందే ఏదో ఒకటి చేయాలి.

ఏంచేయాలి?

షాడో ఆలోచనలు ఎవరికీ కనిపించకుండా దాచుకొని వున్న ఆయుధం మీదికి మరలాయి.

అప్రయత్నంగా అతని మనస్సు తనకు కరాటే నేర్పిన చైనీయుడు మాటలను మననం చేసుకున్నది.

"రాజూ... ఎల్లప్పుడూ నీదే విజయం అని భ్రమ పడకు, ఒక్కొక్కసారి శత్రువుల చేతికి చిక్కి బందీ అవ్వాల్సి వస్తుంది. కొట్టి విజయం సాధించటంలో గొప్పతనం లేదు. పట్టుబడి తప్పించుకోవటంలోనే నీ టెంపరితనం బయటపడుతుంది. ఆ సమయంలో ఆయుధాలు వుండవు. అయినా ఆయుధాల అవసరం చాలు వుంటుంది."

ఉన్నట్లుండి చిన్నగా నవ్వుకున్నాడు షాడో. కరాటే మాస్టర్ తనకు ఒక్క కరాటే మాత్రమే నేర్పలేదు. యింకా చాలా చాలా విద్యలు నేర్పాడు.

"రాజూ...మీ మోడ్రన్ బూన ప్రపంచంలో కొన్ని కోట్లమంది ఉపయోగిస్తూ వుంటారు. కాని యీబూట్లు మాత్రం ప్రత్యేకంగా తయారుచేయబడ్డాయి. యిదుగో–యీసోల్ ని పట్టిలాగితే ఒక ప్లాస్టిక్ ముక్కవూడి వస్తుంది. యిది నీ తొడకు అతికించి వున్న బ్లేడులాంటి కత్తికి పిడిలాగా వుపయోగిస్తుంది."

సి.ఐ.బి.లో చేరినా కూడా ఆపద్ధతిని ఉపయోగించటం మానలేదుషాడో. బ్లేడుకంటే పలుచగా వున్న చిన్నచాకు కుడితొడ పక్కకు అతికించి వుంది. ప్లాస్టిక్ టేప్ తో దాన్ని బయటకు తీయగలిగితే!

తొడలకు రుద్దుకుంటూ తీవ్రంగా ఆలోచించటం ప్రారంభించాడు. షాడో వంక చూస్తూ రెండు నిముషాల కొకసారి వికటంగా నవ్వుతూనే వున్నాడు జనార్ధన్.

అతని నవ్వు విన్నప్పుడల్లా షాడో శరీరం జలదరించి పట్టుబోయే దుస్తితిని గురించి హెచ్చరిస్తూనే వుంది.

***

"రాజు అంత తేలికగా మాట్లాడతాడని అనుకోను. యింకా కొంచెం టెస్ట్ చెయ్యాలి!" జబేదాతో అన్నాడు విక్టర్.

మౌనంగా తలవూపిందామె.

ఉన్నట్లుండి ఆమెను తన ముందుకు లాక్కున్నాడు విక్టర్.

"జుబేదా... ఎంతో కాలంనుంచి నా క్రిందపనిచేస్తున్నావ్.యింత వరకూ నేను నిన్ను తాకను గూడా తాకలేదు." భయంగా చూస్తూ పెనుగులాడింది జుబేదా. విక్టర్ ఆమెను మరింత గట్టిగా పట్టుకున్నాడు.

విస్కీమత్తులో అతనికళ్ళు మూతలు పడుతున్నాయి. ఆ మైకంలో ఏం చేస్తున్నాడో తెలియని పరిస్థితిలో ఆమెను ఆక్రమించుకున్నాడు.

రెండు క్షణాలసేపు గింజుకున్నది జుబేదా. ఉన్నట్లుండి అభ్యంతరం చెప్పటం ఆపివేసింది.

ఆమెజారి క్రిందపడిపోయింది. పాలరాతివంటి ఆమె దేహాన్ని ఆత్రంగా ఆకలిగా కౌగిలించుకున్నాడు విక్టర్.

***

రెండు గంటలసేపు కష్టపడ్డాడు షాడో. మణికట్ల మీద నాలుగుఅంగుళాల యివతలకు బిగించిన వైర్లు జరిగి మణికట్ల మీదికి వచ్చాయి. వాటిని తెంచుకునే ఓపిక లేక ఆ

ప్రయత్నం మానుకున్నాడు.

చేతులను'వి' ఆకారంలో వంచి వాటి మధ్యలో నుంచి శరీరాన్ని యువతలకు చేర్చాలని అతని ఆలోచన. అలా చేస్తే చేతులు ముందుకువస్తాయి. తొడమీద వున్న కత్తిని అందుకోవచ్చు.

ఆ ప్రయత్నంలో నిమగ్నుడై వుండగా తలుపు తెరుస్తున్న సవ్వడి వినిపించింది.

వెంటనేగోడకు చేరగిలబడి స్పృహలో లేనట్లు కనులు మూసుకున్నాడు. విక్టర్ వస్తున్నాడేమో! ఇచ్చిన గడువు అప్పుడే అయిపోయిందేమో!!

రకరకాల ఆలోచనలు అతన్ని అలుముకుని ఉక్కిరి బిక్కిరి చేయటం ప్రారంభించాయి. తలుపులు తెరుచుకున్నాయి.చల్లటిగాలి రివ్వున లోపలికివచ్చింది. గాలితో పాటు గుప్పుమంటూ షాడో నాశికారంధ్రాలకు సోకిందొక సువాసన.

సెంటువాసన!!

జుబేదా వుపయోగించే అత్తరు సువాసన!!!

కళ్ళుతెరిచి చూశాడు షాడో తలుపులు దగ్గిరికి వేసి

అతన్ని సమీపించింది జుబేదా.

కన్నీరు కారుస్తూ అతనిముందు మోకరించి కూర్చుంది.

“జుబేదా!” ఆశ్చర్యంగా అన్నాడు షాడో.

అతని తలను గుండెలకు అదుముకొని వెక్కివెక్కి ఏడ్చింది జుబేదా.

“రాజూ! నేను నిన్ను పడకొట్టక పోయినట్లయితే వాళ్ళు ఖచ్చితంగా నన్ను చంపి వుండేవాళ్ళు.నీ ప్రాణాలు కాపాడతామని ప్రయత్నించియిలా చిత్రహింసల బారిన పడవేశాను. నన్ను క్షమించవూ!” అన్నది కన్నీరువిడుస్తూ.

అర్థం చేసుకున్నాడు షాడో “జుబేదా!నువ్వు యిక్కడికి రావటం బాగోదు. ఎవరైనా చూస్తే నీకు ముప్పు వస్తుంది వెళ్లిపో” అని హెచ్చరించాడు.

“ఎవరూ చూడరు. విక్టర్ తప్పతాగి నిద్రపోతున్నాడు. కాపలావాళ్ళు డెక్ మీదికి వెళ్ళారు... రాజూ..యిది వుంచుకో” అంటూ బ్లౌజులోనుంచి చిన్న పిస్టల్ ని తీసి అతని పిడికిటిలో పెట్టింది జుబేదా.

రేపు విక్టర్ నీ దగ్గిరికి వచ్చినప్పుడు దీని సాయంతో

తప్పించుకో అనిచెప్పింది.

పిడికిటిలోవున్న పిస్టల్ విక్టర్ కి కనిపిస్తుంది. చేతులు విడిపించుకున్నా తెలిసిపోతుంది. జుబేదా తలుపులువేసి వెళ్ళాలి. తాళంచెవులు తిరిగి విక్టర్ జేబులోపెట్టితీరాలి.

తలవూపాడు షాడో. ముందు ఆమెను అక్కడనుంచి పంపివేయాలన్ని తలంపుతో ఆమె చెప్పిన వాటి కన్నిటికీ వూకొట్టాడు.

"జాగ్రత్త రాజూ! జాగ్రత్త!" అని హెచ్చరించి వెళ్లిపోయింది జుబేదా. తలుపులు మూతబడిన మరుక్షణం తన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించాడు షాడో.

పావుగంట తరువాత చేతులు ముందుకు తెచ్చుకున్నాడు. పిస్టల్ ని పాంటు లోపలి భాగంలో దాచి, తిరిగి యథాప్రకారం చేతుల్ని వెనక్కి చేర్చుకున్నాడు.

గది మూలనవున్న జనార్ధన్ నవ్వుతూనే వున్నాడు.

ఆనవ్వుకు షాడోను ఆవరించుకుంటున్న మైకపు తెరలు గూడా భయపడి తొలగిపోయాయి.

గాలికి ఎగసిపడుతున్న అలలలో ఉయ్యాలలు వూగుతూ నిలబడి వున్నది మెహరున్నిసా సిబ్బందిఅంతా

డెక్ పైభాగంలో నిలబడి జాలీగా కాలం గడుపుతున్నారు.

నలుగురు నావికులు ఓడ ముందుభాగంలో నిలబడివున్నారు. పది అడుగుల పొడవున పెద్ద యినుపస్థంభం ఒకటి నీటిమీదికి వ్యాపించివుంది.

ఒక నావికుడు దాని మీదుగా పాకి ఒక లావాటితాడును ఆ స్తంభం చివరబిగిస్తున్నాడు.

“ఉచ్చు సరిగ్గా బిగించికట్టు...” పెద్దగా అరిచాడొక నావికుడు. స్తంభం మీది నావికుడు ఆ త్రాటిచివర పెద్ద ఉచ్చు ముడివేసి ఓడమీదికి చేరుకున్నాడు.

సముద్రం మీదినుంచి వస్తున్న గాలికి అటూ ఇటూ వూగుతూ భయంకరంగా కనిపించసాగిందా వురిత్రాడు.

తాముచేసిన పనిని ఒకసారి చూసుకుని తృప్తిగా తలలు ఆడించారా నావికులు.

అదే సమయంలో డెక్ లోపలి భాగంలో నుంచి పైకి వచ్చాడు విక్టర్, జుబేదా అతనికి వెనుకగా వచ్చింది.

ఉచ్చుముడిని చూసి తలవూపి మెచ్చుకున్నాడు విక్టర్.

ఉదయం ఎనిమిది గంటల సమయం అది .

సూర్యుడు సముద్రంమీద రెండుబారల ఎత్తులో వున్నాడు.

"బంధితుణ్ని తీసుకురండి!" ప్రక్కనే నిలబడిన అనుచరుణ్ని హెచ్చరించాడు విక్టర్. చేతులువెనక్కి విరిచి కట్టబడిన షాడో డెక్ మీదికి తీసుకురాబడ్డాడు. దూరదూరంగా వున్న నావికులందరూ వింత చూడటానికన్నట్లు ఓడ ముందుభాగానికి చేరుకున్నారు.

షాడోని చూడగానే వ్యంగ్యంగా నవ్వుతూ పరిహాసంగా శాల్యూట్ చేశాడు విక్టర్. "హల్లో మిస్టర్ రాజూ! బాగా నిద్రపట్టిందా!" అని ప్రశ్నించాడు వినోదంగా చూస్తూ.

సమాధానం యివ్వలేదు షాడో. శక్తిలేనట్లు మెడ ప్రక్కకి వాలిపోతున్నది. శరీరం మీద ఎండిపోయి చారికలు కట్టిన రక్తపు వాసనకు – యీగలు గుంపులుగా వచ్చిచుట్టు ముట్టుకుంటున్నాయి.

"రాజూ! యిదేమిటో తెలుసా? దాన్ని ఉరిత్రాడు అని అంటారు..." అంటూ తాటిని చూపించి దాని ఉపయోగాన్ని వివరించాడు విక్టర్.

అప్పటికీ పెదవి కదలించలేదు షాడో. శరీరంలో వున్న శక్తినంతా కూడగట్టుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

తెల్లటి సిల్కుదుస్తులు ధరించి వున్నాడు విక్టర్. ఆనీరెండలో స్మార్ట్ గా కనిపిస్తున్నాడు. చిరిగి పీలికలయిన దుస్తులతో నిలబడివున్నాడు షాడో. బిచ్చగాడికంటే అసహ్యంగా కనిపిస్తున్నాడు.

ఠీవిగా అడుగులు వేస్తూ షాడో సమీపంలోకి వచ్చిన నిలబడ్డాడు విక్టర్.

"రాజూ! నీనేర్పరితనానికి ఎంతగానో మెచ్చుకుంటున్నాను. కాని నా రహస్యాలను తెలుసుకోవటానికి ప్రయత్నించి నాకు కోపం తెప్పించావ్. నా కుడిభుజంలాంటి అనుచరుణ్ణి చంపి నాకుద్రోహం చేశావ్. అందుకుప్రతిఫలంగా నిన్ను సముద్రగర్భంలో సమాధి చేయాలని నిశ్చయించాను. ముందు ప్రాణం అంటే ఎంత తీపివుందో చూసి ఆ బరీయల్ ఏర్పాట్లు చేస్తాను."

విక్టర్ మాటలు వింటూ కనుచివరలనుంచి చుట్టూ చాశాడు షాడో. ఒక పక్కగా పెద్దపెద్ద సిమెంట్ పలకలు నిలబెట్టివున్నాయి. వాటికి అమర్చివున్న యినుప గొలుసులను చూడగానే షాడో పెదిమల మీద సన్నటి చిరునవ్వు వెలిగి మాయమైపోయింది.

ఆ సిమెంట్ పలకలను కాళ్ళకు తగిలించి సముద్రంలో పడేయిస్తాడు కాబోలు. అలా చేస్తే యిక బయటికి రావటం అనే ప్రశక్తేలేదు.

జుబేదా యిచ్చినపిస్టల్ బయటికిలాగాలని అనుకున్నాడు. కాని అందుకు అంగీకరించలేదతని హృదయం. పిస్టల్ ని చూసిన మరుక్షణం జుబేదా తనను డబుల్ క్రాస్ చేసిందని గ్రహిస్తాడు విక్టర్. ఆమె ప్రాణాలు తీసిగానినిద్రపోడు.

"ఆల్ రైట్ మైడియర్ రాజూ ! గుడ్ బై!!" అంటున్నాడు విక్టర్.

జుబేదా ముఖం రక్తంలేనట్లు పాలిపోయింది. వణుకుతున్న పెదిమలను మునిపళ్ళతో నొక్కిపట్టుకొని నిలబడి వుంది. ఆ కళ్ళలో సుడులు తిరుగుతున్న నీటిని చూశాడు షాడో.

ఉరిత్రాడు వైపు నడిపించటానికి వస్తున్న విక్టర్ అనుచరులను గమనించాడు . మరుక్షణం ప్రశాంతంగా వున్న డెక్ పైభాగం.

అంతా అరుపులతో గందరగోళమై పోయింది.

పట్టుకోవటానికి వచ్చిన వారికి అందకుండా ఎగిరి పక్కకు దూకాడు షాడో. అడ్డువచ్చిన యిద్దరు నావికులను తలతో గుండెలమీద పొడిచి ముందుకుపరుగుతీశాడు.

"పట్టుకోండి...చంపండి...పట్టుకోండి..." పెద్దగా అరిచాడు విక్టర్. అతనికంటె బిగ్గరిగా అరుస్తూ నావికులందరూ షాడో మెనుకపడ్డారు. నాలుగు అంగల్లో డెక్ చివరిభాగాన్ని సమీపించాడు షాడో. చేతులు వెనక్కి విరిచి కట్టబడే వున్నాయి. అలాగే ఎగిరి గాలిలోకి డైవ్ చేశాడు . వింటినుంచి వెలువడిన బాణంలా పోయి నీటిలో పడ్డాడు.

ధన్ మన్న శబ్దం వినవచ్చింది డెక్ మీదినుంచి. ఒక బుల్లెట్ కందిరీగలాగా ఝుంకారం చేస్తూ షాడో చెవి ప్రక్కనుంచి నీటిలోకి దూసుకుపోయింది. ఆ తరువాత ఏం జరుగుతున్నదో తెలుసుకునే అవకాశం లేకపోయింది.

మంచుకంటె చల్లగా వున్నట్లున్న సముద్రపు నీరు షాడోను ఆహ్వానించింది. తల్లక్రిందులుగా పాతికి అడుగుల లోతుకు దూసుకుపోయాడు. క్రిందికిదిగే వేగం తగ్గగానే బలమంతా వుపయోగించి చేతులను విదిలించాడు.

మణికట్లు ఒరుసుకుపోయి రక్తం వెలువడింది. ఉప్పునీరు తగిలి బాధతో తల తిరిగిపోయింది.

ఒకటి ...రెండు... మూడవ నిముషం పూర్తికాబోతుండగా అతని కండరాల బలిమి ముందు చేతులను బంధించి వున్న సన్నపాటివైపు ఓడిపోయింది. చేతులు విడిపడ్డాయి.

ఊపిరి బిగించివుండటంవల్ల గుండెలు మంటలు పుట్టసాగాయి. నాలుగు నిముషాలు దాటితే ప్రమాదం తప్పదని గ్రహించి వేగంగా పైకి కదిలాడు షాడో.

ఉన్నట్లుండి చీకట్లు అతన్ని చుట్టుముట్టాయి. ఉలిక్కిపడి పైకి యీదటం ఆపుచేసి పక్కకు జరిగాడు షాడో. అప్పటికే నీటి పైభాగానికి చేరుకోవటం జరిగిపోయింది. నీటిలో తేలుతున్న మెహరున్నీసా చుక్కాని స్తంభం బలంగా తగిలింది తలమీద.

షాడో కళ్ళు బైర్లు కమ్మాయి. అతి ప్రయత్నంమీద పక్కకు యీది తలమాత్రం నీటిపైకి చేర్చిగుండెలనిండా గాలి పీల్చుకున్నాడు. రెండు చేతులతోనూచుక్కాని స్థంభాన్ని కౌగిలించుకొని పదినిముషాలపాటు

కనులుమూసుకొని కదలకుండా వుండిపోయాడు.

***

"లేదుసార్.. నేను చూశాను. బుల్లెట్ అతని తలలో దిగబడింది. నా కళ్ళారా చూశాను" రివాల్వర్ పట్టుకున్న ఒక నావికుడు విక్టర్ ని నమ్మించటానికి విఫల ప్రయత్నం చేయసాగాడు.

నావికులు అందరూ డెక్ చివరి భాగంలో బిగించివున్న యినుపస్థంభాలను అనుకొని నీటిలోకి చూస్తున్నారు. అందరి చేతుల్లోను రైఫిల్స్ వున్నాయి. నీటిలో ఏమాత్రం కదలిక కనిపించినా గురిచేసి పేలుస్తున్నారు.

పెద్ద రివాల్వర్ నొకదాన్ని గట్టిగా పట్టుకొని నీటిలోకే గుచ్చి గుచ్చి చూస్తున్నాడు విక్టర్. అంతనిముఖంనిండా ఆందోళన అలుముకొని వుంది.

"చచ్చిపోయే ఉంటాడువిక్టర్ సాబ్.... చేతులు స్వాధీనంలో లేకుండా తల్లకిందులుగా చూశాడు. ఇక్కడ నీటిలో పలుబండరాళ్లున్నాయి. వాటిని గుద్దుకొని తల పగిలి చచ్చిపోయి వుంటాడు."

"అవునుసార్... ప్రాణాలతో వుంటే యీపాటికి

నీటిమీదికి తేలవలసింది. ఇంతవరకూ ఒక్కచేపకూడా నీటిమీదికి రాలేదు. చచ్చిపోయే వుంటాడు సార్."

పెదవులు కొరుక్కుంటూ వారిమాటలు విన్నాడు విక్టర్.

"ఆల్ రైట్... ఎందుకైనా మంచిది. ఒక మినీబోట్ ని నీటిలోకి వదలండి. నలుగురు నావికులు యీప్రాంతాలన్నిటినీ పూర్తిగా పరిశీలించండి. మనం యిక్కడ వుండటం యిక మంచిది కాదు. ఇండియా తిరిగి వెళుతున్నాం. అందుకు ఏర్పాట్లు చేయండి " సాలోచనగా ఆర్డర్లు యిచ్చాడు.

కర్ణకఠోర శబ్దాలుచేస్తూ మినీబోట్ ఒకటి నీటిలోకి దిగింది.

నలుగురు నావికులు రైఫిల్స్ రెడీగా పట్టుకొని నౌకచుట్టూ రౌండ్ కొట్టటం ప్రారంభించారు.

మినీబోట్ నీటిలోకి దిగుతున్న శబ్దంవిన్నాడు షాడో. వెంటనే గుండెలనిండా గాలిపీల్చుకొని నీటిలో మునిగాడు. నౌకక్రిందిభాగాన్ని చేతులతో తడుముతూ ముందుకు జరిగి నౌకను నడిపే ప్రొఫెల్లర్స్ ని సమీపించి అక్కడ

దాగుకొన్నాడు.

నాలుగు నిముషాలు గడిచాయి. షాడో ఊపిరి బిగపట్టగల టైం అది . బయటకురాక తప్పలేదు. అదృష్టవశాత్తూ మినీబోట్ అప్పటికే ఒకరౌండ్ పూర్తిచేసుకొని దూరంగా వెళ్ళిపోయింది.

మరో అరగంట తరువాత అది ఓడమీదికి చేర్చబడటం చూశాడు షాడో.

ఉన్నట్లుండి చుక్కాని కదిలింది. షాడో శరీరం జలదరించింది. మెహరున్నిసా ప్రయాణం ప్రారంభించబోతున్నది.

ఎక్కడికి?

నౌకను వదిలి తీరానికి యీదుకుపోదామా అన్నయోచన రెండు క్షణాలపాటు షాడో అంతరంగాన్ని వేధించింది. కాని చేతికి అందిన విక్టర్ ని చేయిదాటి పోనిస్తే, తిరిగి పట్టుకోవటం కష్టం.

ఎంతదూరం పోతాడో చూడటానికే నిశ్చయంచేసుకొని చుక్కాని స్తంభాన్ని వదిలి ప్రక్కకు జరిగాడు. నిశ్శబ్దంగా యీదుతూ, పైకి కనిపించకుండా

జాగ్రత్త పడుతూ ఓడముందు భాగాన్ని చేరుకున్నాడు. అప్పుడే పైకి లేచాయి లంగర్లు, వాటి గొలుసుల్ని పట్టుకొని ఓడకు ప్రక్కగా వ్రేలాడబడ్డాడు షాడో.

మ్రోతలు చేస్తూ యింజన్ లు పనిచేయటం ప్రారంభించాయి. మెల్లిగా కదిలింది... పక్కకు తిరిగి భారతదేశం వైపు ప్రయాణం ప్రారంభించింది... మెహరున్నీసా.

***

బైనాక్యులర్స్ ని పక్కనపెట్టి చెమటలు పట్టినముఖాన్ని తుడుచుకున్నాడు ముఖేష్.

"శ్రీ.... వస్తున్నారు చూశావా?" అన్నాడు పక్కకు తిరిగి చూస్తూ.

టర్కీటవల్ నొకదాన్ని ముఖంమీద పరుచుకుని మగత నిద్రబోతున్న సి.ఐ.బి. జూనియర్ ఏజెంట్ శ్రీకర్ వులిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"బైనాక్యులర్స్ నీదగ్గిర వున్నాయి. ప్రస్తుతం వాచింగ్ డ్యూటీ చేస్తున్నది నువ్వు. ఎవరొస్తున్నారో – ఎవరుపోతున్నారో నాకెలా తెలుస్తుంది?" అన్నాడు మంచి

నిద్రచెడి పోయిందన్న ఉక్రోషంతో.

నవ్వుతూ బైనాక్యులర్స్ ని అతడికి అందించాడు ముఖేష్,

"మైగాడ్! మెహరున్నీసా!" అన్నాడు శ్రీకర్.

తలవూపాడు ముఖేష్. కూర్చున్న చోటు నుంచి లేచి స్టీరింగ్ ముందుకు వెళ్ళాడు. పది అడుగుల పొడవు ఆరడుగుల వెడల్పువున్న మోటార్ బోటుమీద వున్నారు వారిద్దరూ.

భారతతీర ప్రాంతం అక్కడికి వందమైళ్ళదూరం వుంది.

"గురూ. రాజు మెహరున్నీసాలో వుంటాడంటావా" బైనాక్యులర్స్ తో మెహరున్నీసానుశల్య పరీక్ష చేస్తూ అన్నాడు శ్రీకర్.

మౌనంగా బోటు స్టార్ట్ చేశాడు ముఖేష్. ఎగిసిపడుతున్న అలలలో ముందుకుదూకింది మెహరున్నీసాకు మూడుమైళ్ళ దూరంలోకి తీసుకుపోయాడు.

"దుర్మార్గులు, ఎక్కడ లంగరువేస్తారో!!" తనలో తనే

అనుకుంటున్నట్లు పైకే కామెంట్ చేశాడు శ్రీకర్.

ఆ కామెంటుకు కూడా సమాధానం ఇవ్వలేదు ముఖేష్.

"గురూ...వద్దుకుపోయి పోలీస్ స్క్వాడ్ కి రిపోర్టు చేస్తే బాగుంటుంది. ఓడను స్వాధీనపరచుకుంటే విక్టర్ ఝటాలం వదిలిపోతుంది."

ఆమాటకు కూడా ముఖేష్ సమాధానం యివ్వకపోవటంతో కోపంతో పక్కకు తిరిగాడు శ్రీకర్.

పొడుగాటి నైలాన్ త్రాటిని రెడీ చేసుకున్నాడతను. దగ్గిర దగ్గిరగా రెండన్నర మైళ్ళపొడవు వుందది. చిటికెన వేలంత లావే వుంది. అయినా వెయ్యి కిలోల బరువును ఆపగల బలం కలిగివుంది.

దాని కొసను మోటార్ బోట్ లో ఒక యినుపరింగుకు బిగించి రెండవ కొనకు నాలుగు అడుగుల పొడవున్న యినుప సాధనాన్ని బిగించాడు ముఖేష్. ఆసాధనంమీద వున్న చిన్నమీటను నొక్కి నీటిలోకి వదిలాడు.

వెంటనేచేపలాగా ముందుకుదూసుకుపోయి మెహరున్నీసాను సమీపించి నీటిపైకి తేలింది. "ఎందుకు

గురూ!" అర్థంకాక అడిగాడు శ్రీకర్.

కనుబొమ్మలు ముడివేసి సీరియస్ గా చూశాడు ముఖేష్,

"ఆల్ రైట్... ఆల్ రైట్.. పెద్ద సస్పెన్స్..." అని గొణుగుతూ బైనాక్యులర్స్ ని మెహరున్నీసా వైపు తిప్పాడు శ్రీకర్.

అప్రయత్నంగా అతనిదృష్టి ఓడలంగరు గొలుసులమీదికి ప్రసరించింది. మెహరున్నీసా నాలుగురోజులు సముద్రం మీద ప్రయాణించింది. మరో పన్నెండు గంటలు ప్రయాణిస్తేగాని తీరాన్ని సమీపించటం జరగదు.

నాలుగురోజులు... లంగరు చైన్లమీదే కాలక్షేపం చేస్తున్నాడు షాడో. ఎగసిపడుతున్న నీటిలో తడుస్తూ, చలికి వణుకుతూ దాహంతో ఎండుకుపోతున్న కంఠనాళాలను అతిప్రయత్నంమీద స్వాధీనంలో వుంచుకుంటూ, శరీర బాధల్ని మరచిపోవటానికి విశ్వప్రయత్నంచేస్తూ కొనప్రాణాలతో లంగరు గొలుసుల్ని పట్టుకొని వ్రేలాడుతున్నాడు.

అతన్ని గమనించగానే బైనాక్యులర్స్ ని బోటులోకి విసిరాడు.

శ్రీకర్ ఎగిరి నీటిలోకి డైవ్చేశాడు. మధ్యలోనే పాంటు బెల్టు పట్టుకొన్నాడు ముఖేష్.

బోటులోకిలాగి బలంగా ముక్కుమీద గుద్దాడు.

శ్రీకర్ ప్రాణం కటబట్టింది. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

ముక్కు సవరించుకొంటూ "నన్నెందుకు గుద్దినట్టు?" ప్రశ్నించాడు.

“బ్లడీఫూల్...రాజు ఓడ పైభాగానికి వెళ్ళే అవకాశంలేక అలా బిగపట్టుకొని ప్రయాణం చేస్తున్నాడు. నువ్వు ఓడసమీపంలోకి పోతే నావికులు డెక్ చివరికి వస్తారు. రాజు వాళ్ళకు కనిపించి తీరతాడు.”

“ఓహో” అనుకున్నాడు శ్రీకర్. ముక్కునుసవరించుకొంటూ ఓడవైపు చూడటం ప్రారంభించాడు.

ఓడ ప్రక్క భాగంలో వేలాడుతున్న షాడో వారి బోటును గమనించినట్లుంది. లంగరు చైన్లను వదిలి నీటిలోకి జారాడు.

నీటిలో మునిగి యీదుతూ అరమైలుదూరం యివతలికి వచ్చాడు.

ముఖేష్ వదిలిన యినుపసాధనం యాలలాంటి చిరుశబ్దాలు చేస్తూ నీటిమీద తేలుతోంది. దానిశబ్దాలు విని అటు వచ్చాడు షాడో. దాన్ని రెండుచేతులతోను బిగించి పట్టుకున్నాడు.

వెంటనే బోటులోవున్న మోటార్ ని ఆన్ చేశాడు ముఖేష్.

నైలాన్ దారం బోటువైపు లాగబడింది.

పదినిముషాలలో బోటుమీదికి వచ్చి నీరసంగా చెక్కలమీద వాలిపోయాడు షాడో.

టవల్ తో అతని శరీరాన్ని తుడిచి మందంగా వున్న వులెన్ కంబళ్లు కప్పారు ముఖేష్ శ్రీకర్లు.

వెంట తీసుకువచ్చిన మెడికల్ బాగ్ లో నుంచి రెండు టాబిలెట్లను అతనిచేత మ్రింగించాడు. వేడివేడి కాఫీకాచి త్రాగించారు. అరగంట తరువాత లేచి కూర్చున్నాడు షాడో.

ఒకటొకటిగా జరిగిన విషయాలన్నీ వారికి వివరించాడు. మెహరున్నీసా ఆగలేదు ! తీరంవైపు

ప్రయాణిస్తూనే వుంది. దూరంలో కనిపిస్తున్న బోటును చూసి చేపలు పట్టుకోవటానికి వచ్చిన బోటు అని భ్రమపడ్డారు అందులోని నావికులు.

దానికి వెనుక ఐదు మైళ్ల దూరంలో అతిజాగ్రత్తగా అనుసరించాడు ముఖేష్.

చీకటి పడే సమయానికి తీరాన్నిసమీపించింది మెహరున్నీసా. లంగరునీటిలోకి దిగింది. మినీబోట్లలో దానిమీద నావికులుభూమివైపు బయలుదేరారు.

మోటార్ బోటులోవున్న వైర్ లెస్ సెట్ ని అందుకున్నాడు ముఖేష్. "హల్లో... సీడ్రాగన్ స్పీకింగ్... కెన్ యూ హియర్ మీ?" అని ప్రశ్నించాడు. రెండు క్షణాల తరువాత రెస్పాన్స్ వచ్చింది.

సి.ఐ.డి. చీఫ్ ఫెర్నాండజ్ స్వయంగా లైన్ మీదికి వచ్చాడు. మెహరున్నీసాను గురించి వివరించాడు ముఖేష్.

"దాన్ని సి.ఐ.డి. లను పంపి హేండవర్ చేసుకోమని చెప్పు విక్టర్ సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు షాడో.

"సంథింగ్ డూయింగ్... నీతో మేమూ వస్తాం" వెంటనే అందుకొన్నాడు శ్రీకర్.

"నో...మీరు నావికులను కవర్ చేయండి నేను విక్టర్ ని కవర్ చేస్తాను... నోమోర్... ఆర్గ్యుమెంట్.." అంటూ లేచాడు షాడో. శ్రీకర్ బెల్టువెనుక దాచుకొన్న 41 కాలిబర్ రివాల్వర్ ని తీసుకొని పాంటుజేబులో పెట్టుకొన్నాడు. ముకేష్ ముంజేతి మీద తొలుపటకాలో బిగించివున్న డాగర్ ని బూటులో దోపుకొని ఎగిరి నీటిలోకి డైవ్ చేశాడు.

బలంగా బారలు వేస్తూ మెహరున్నీసా వైపు యీదుకొంటూ పోయాడు.

***

షాడో మెహరున్నీసాను సమీపించేసరికి విక్టర్ తీరంమీదికి వెళ్ళిపోయాడు. అతనితోపాటు జుబేదాకూడా వున్నది.

తీరంమీద వారికోసం ఒక అంబాసిడర్ వెయిట్ చేస్తోంది. వారు ఎక్కిన క్షణం కదిలి చెట్లచాటున మాయమైపోయింది.

త్వరపడలేదుషాడో. తాపీగా వడ్డునుచేరుకొన్నాడు. దుస్తులను పిండుకొని , మెల్లిగా చెట్లతోపునుదాటాడు. చెట్లతోపుకు ఆవల రెండుమైళ్ళ దూరంలో పాంజిమ్,

డయ్యూ ట్రంక్ రోడ్ వుంది.

ఒక అరగంట వెయిట్ చేసేసరికి ఒక లారీ అటుగా వచ్చింది. దానిలో పాంజిమ్ చేరుకున్నాడు.

అంతకుముందు బసచేసిన ఎయిర్ కండిషన్డ్ హోటల్ కే వెళ్ళాడుమరో రెండు రోజులు చూసి, షాడో తీసుకున్న గదిని స్వాధీనం చేసుకొందామని అనుకుంటున్నాడు హోటల్ యజమానులు.

చిరిగిపోయిన దుస్తులతో, మాసిపోయిన గడ్డంతో ప్రత్యక్షమైన షాడోను చూసి నోరు తెరిచాడు రిసెప్షనిస్టు.

జబర్దస్తీగా గదితాళంచెవి తీసుకొని తనగదికి వెళ్ళాడు షాడో. ఎయిర్ బాగ్ ఎక్కడ వదిలాడో అక్కడే వున్నది. అందులోని దుస్తులు, సామాను చెక్కుచెదరలేదు. ఎవరి చేయీ వాటిమీద పడలేదు.

షేవ్ చేసుకొని, డ్రస్ మార్చుకుని ట్రిమ్ గా తయారయ్యేసరికి తెల్లవారుఝాము అయింది.

పాంజిమ్ సిటీ గాఢనిద్దురలో వుంది. హోటల్ ముందు కునికిపాట్లు పడుతున్న ఒక టాక్సీ డ్రయివర్ ని తట్టిలేపి టాక్సీలో కూర్చున్నాడు షాడో.

తూర్పుదిక్కు తెల్లబడుతున్న సమయానికి పురానాబస్తీకాళికాలయం దగ్గరికి చేరుకున్నాడు.

షిక్కాభవనం నిశబ్దంగా వుంది . గేటుముందు యథాప్రకారం యిద్దరు దృఢకాయులు కాపలా వున్నారు.

టాక్సీని పంపి భవనం వెనుక భాగానికి వెళ్ళాడు షాడో. ప్రహరీ మీది నుంచి గులాబీ తోటలోకి దూకాడు.

అంతకుముందు సన్నివేశం గుర్తుకువచ్చి మళ్ళీ రెండు గులాబీలనుకోసి, జేబులో వేసుకుంటూ భవనాన్ని సమీపించాడు.

క్రింది అంతస్థులోకి కిటికీలన్నీ తెరిచివున్నాయి. షిక్కా, అతని అనుచరులు పదిమందిసోఫాలలో కూర్చుని వున్నారు.

కిటికీచాటున నిలబడ్డాడు షాడో . షిక్కానాలుగు అడుగుల దూరంలో నిలబడివున్నాడు విక్టర్. విస్కీ గ్లాసునుచేతుల్లో త్రిప్పుతూ మాట్లాడుతున్నాడు.

శ్రద్ధగా విన్నాడు షాడో.

“మన పనులన్నిటినీ కొంతకాలం పోస్ట్ పోని చేద్దాం. మనమీద అనుమానం కలిగి, అతిచొరవగా మనుష్యులను

పంపిస్తున్నారు. వారిగోల సర్దుమణిగేదాకా మనం అండర్ గ్రౌండ్ లో గడపటం మంచిది. జుబేదా నేనూ.. ఉదక మండలం పోతున్నాం. ఓరెండు నెలలు అక్కడ ఎంజాయ్ చేసి తిరిగివస్తాం" అంటున్నాడువిక్టర్.

జుబేదా కోసం చూశాడు షాడో. ఆమె వారితో లేదు. చల్లగా కిటికీ ప్రక్కనుంచి తప్పుకున్నాడు. మరొక్కసారి కొబ్బరిచెట్టుమీదుగా మూడవ అంతస్థును సమీపించాడు.

మంచంమీద కనిపించింది జుబేదా... అప్పటిమాదిరి గానే అర్ధనగ్నంగా నిద్రిస్తున్నది.

స్టీమర్ సలీమాతో ఆమెతో గడిపిన రోజులు గుర్తుకువచ్చి గాఢంగా నిట్టూర్చాడు షాడో.

ఆమెను ఎలా అర్థం చేసుకోవాలి? ఏమని అనుకోవాలి? షాడో అంతరంగం ఆమెను గురించి తర్క వితర్కాలు జరుపుతూనే వుంది. జుబేదా గదికి ఆవలివైపున వున్న ద్వారం తెరుచుకుంది.

చటుక్కున కిందికి వంగి గోడచాటుకు చేరాడు షాడో. బరువైన సూట్ కేస్ ని మంచందగ్గిర పెట్టి వళ్ళు విరుచుకుంటున్నాడు లోపలికి వచ్చిన విక్టర్.

నిశబ్దంగా లేచి నిలబడ్డాడు షాడో.

విక్టర్ – జుబేదా భుజాలమీద చేయివేసి కదిలిస్తున్నాడు . కళ్ళు తెరిచి చూసిందామె.

“ప్రయాణానికి సిద్దంకా డియర్....రేపటి నుంచి రెండు నెలలపాటు నీ యిష్టం వచ్చినట్లు విశ్రాంతి తీసుకుందువు గాని" అంటున్నాడు విక్టర్.

లేచి నిలబడింది జుబేదా.... అంతవరకూ ఆమె శరీరాన్ని కప్పివుంచిన వున్నిదుప్పటి జారిక్రిందపడిపోయింది.

పాలరాతి బొమ్మలా – సౌందర్య దేవతలా విక్టర్ ముందునిలబడింది నగ్నంగా.

విక్టర్ కనులు ఆవేశంతో ఎర్రబడటం షాడో చూశాడు. పెదిమలు కొరుక్కుంటూ జుబేదాను బిగికౌగిల్లో బంధించాడు విక్టర్. అభ్యంతరం చెపుతున్నట్లు బలంగా గింజుకున్నదామె.

“జుబేదా డియర్... కాదనకు.. యిక మనల్నిద్దర్నీ వేరుచేయగల శక్తి ఎవరికీలేదు. యికనుంచీ మనంకలిసే వుంటాం–” ఆవేశంతో ఆత్రంతో కంపిస్తున్నది విక్టర్ కంఠం.

ఆలోచించాడు షాడో. అతని కోరిక తీర్చకపోవటం ఏమంత బాగోదనిపించింది. హోటల్ నుంచి తెచ్చుకున్న పనామాను జాగ్రత్తగా వెలిగించుకొని పారాపెట్ మీద కూర్చున్నాడు.

అరగంట తరువాత విక్టర్ తృప్తిగా నిట్టూరుస్తున్న సవ్వడి వినిపించి లేచి నిలబడ్డాడు.

“జుబేదా! లేడీ స్మగ్లర్ గా కొన్నికోట్లు సంపాదించాను. మరికొన్ని కోట్లు సంపాదించబోతున్నాను. నాదారికి అడ్డం వచ్చిన వారిని ఎవరినీ ప్రాణాలతో వదలను... ” విక్టర్ చెప్పరాని సంతోషంతో జుబేదాతో అంటున్నాడు.

“ఆరాజును గురించి నువ్వు అతిగా ఆలోచించవద్దు. హీ యీజ్ నథింగ్! అతనితో రెండురోజులు గడిపినంత మాత్రాన అతన్ని గురించి ఆలోచించాలని లేదు.”

ఉన్నట్లుండి జుబేదా వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దం వినిపించింది. కిటికీలో నుంచి లోపలికి చూశాడు షాడో.

“నువ్వే... దీనికి కారకుడివి నువ్వే. నువ్వే నన్ను అతని దగ్గిరికి పంపించావ్ . ఇప్పుడు నువ్వే అతన్ని మరచి పొమ్మంటున్నావ్!”

వికటంగా నవ్వాడు విక్టర్.

"నిజమే జుబేదా.. నేనే కారకుణ్ని అయితే యిప్పుడు నేనే అతన్ని మరిచిపొమ్మని చెపుతున్నాను. నేనే అతన్ని సముద్రగర్భంలో సమాధిచేశాను."

ఆమాట వినగానే ఒక్కసారిగా జంప్ చేసి లోపలికి దూకాడు షాడో. "యువ్వార్ రాంగ్ విక్టర్... నన్ను చంపగలవాడు . చంపి సమాధిచేయగలవాడు యింతవరకూ పుట్టలేదు." అన్నాడు కిటికీని ఆనుకొని నిలబడుతూ.

అదిరిపడి చూశారు వారిద్దరూ.

విక్టర్ కంటే ముందు జుబేదా ఆశ్చర్యంనుంచి తేరుకున్నది ఆమెముఖం ఆనందంతో విప్పారింది.

"రాజూ!" అంటూ ముందుకు రాబోయింది.

ఛటాలున చేయి విసిరాడు విక్టర్. జుబేదా ఎగిరిగోడకు గుద్దుకున్నది. కణత మీద బలమైన దెబ్బతగలటంతో స్పృహ తప్పి వాలిపోయింది.

"శహభాష్ రాజూ! నిన్ను ఎలా మెచ్చుకోవాలో నాకు అర్థంకావటంలేదు. ఎదురుచూడని క్షణంలో

ఎదురుపడడం నీ స్పెషాలిటీ అనుకుంటాను!" నవ్వుతూ అన్నాడు విక్టర్.

జుబేదా కణతమీద తగిలిన గాయంరక్తం వెలువరుస్తోంది. బాధగా మూలిగిందామె.

ఒక్కక్షణం పాటు అటుచూశాడు షాడో.

అదే అదునుగా– కోటు జేబులో నుంచి రివాల్వర్ ని బయటికి లాగాడు విక్టర్. మొదటి బుల్లెట్ షాడో తొడలో దిగబడింది.

మెరుపులా కదిలింది షాడో కుడిచేయి. మాజిక్ లా ప్రత్యక్షం అయింది రివాల్వర్. భయంకరంగా గర్జించింది రెండుసార్లు.

రెండు బుల్లెట్లు విక్టర్ భుజంమీద దిగబడ్డాయి. అతని రెండవ బుల్లెట్ షాడో పాదాదలవద్ద గచ్చును పగలగొట్టింది.

విక్టర్ ముఖంలో ఆశ్చర్యం – అపజయం సిద్ధించిందన్న బాధ.– కోపం – విచారం మొదలయిన భావాలన్నీ ఒకేసారి ప్రత్యక్షమయ్యాయి.

నీరునిండిన కళ్ళతో షాడోవంక సూటిగా చూశాడు.

"దుర్మార్గుడా... నాకలలన్నిటినీ కల్లలు చేశావ్...

ఎవరివి నువ్వు? రాక్షసుడివా? పిశాచానివా?" అన్నాడు అస్పష్టంగా.

అతనిమాటలకు కరుకుగా నవ్వాడు షాడో.

"అవును విక్టర్..రాక్షసుణ్ణే.. ఐయామ్ షాడో– దికిల్లర్ ఫ్రం సి.ఐ.బి."

రివాల్వర్ ఎత్తటానికి ప్రయత్నించాడు విక్టర్. బుల్లెట్ చేసిన గాయంవల్ల అతని కుడిచేయి చచ్చుపడినట్లు కిందికి వాలిపోయింది.

"విక్టర్... నువ్వుచేసిన పాపాలకు శిక్ష అనుభవించక తప్పదు. మర్యాదగా లొంగిపో. అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకోకు" హెచ్చరించాడు షాడో.

"కిల్లర్ ఫ్రం సి.ఐ.బి. – కిల్లర్ ఫ్రం సి.ఐ.బి!" గొణుక్కుంటున్నాడు విక్టర్. ఉన్నట్లుండి పెద్దగా అరిచాడు. నో...నాకు శిక్షలేదు... నేను ఎవరికీ లొంగను" అంటూ వెనుతిరిగి బయటికి పరుగుతీశాడు.

అదేసమయంలో భూకంపం వచ్చినట్లు అటూయిటూ కదిలిపోయిందా మేడ. క్రిందనుంచి పెద్దపెద్ద ప్రేలుళ్ళు వినవచ్చాయి.

***

విక్టర్ వెనుకే పరుగుతీశాడు షాడో. మెట్లమీద నుంచి ఎగురుతూ కిందికి దిగుతున్నాడతను.

"విక్టర్... విక్టర్..లొంగిపో" అని హెచ్చరించాడుషాడో.

విక్టర్ ఆమాటలు వినిపించుకోలేదు. షాడో తొడమీద తగిలిన గాయం విపరీతంగా రక్తాన్ని వెలువర్చి, అతని శక్తిని హరించేస్తోంది. ఒక మెట్టుమీద కాలు మడతపడి బోర్లాపడి పోయాడు షాడో. దొర్లుకుంటూరెండవ అంతస్థు కారిడార్ లోకి పడిపోయాడు.

అక్కడే ఆగి ఆయాసం తీర్చుకొంటూవున్నాడు విక్టర్. షాడోను చూడగానే వెర్రిగానవ్వుతూ ఎడమచేత్తో రివాల్వర్ ఎత్తాడు.

ఎదురుకాల్పులు జరిపే అవకాశం లేదు. నిప్పులు కక్కుతూ వచ్చే బుల్లెట్ కోసం ఎదురుచూస్తూ కనులుమూసుకున్నాడు షాడో.

ధన్ ధన్ ధన్ మని మూడుపేలుళ్ళు ఒకేసారి వినిపించాయి. ఎదురుచూసిన బుల్లెట్ ఎంతసేపటికీ రాకపోయేసరికి కనులుతెరిచాడు.

విక్టర్ రక్తపు మడుగులోపడి వున్నాడు. మెట్లమీద

నుంచి దొర్లుకుంటూ వచ్చి షాడో ప్రక్కనపడింది జుబేదా.

పొగలు కక్కుతున్నది రివాల్వర్ నిబెల్టువెనుక దాచుకొంటూ లోపలికివచ్చాడు ముఖేష్.

జరిగింది గ్రహించి బాధగా తలవిదిలించాడు షాడో.

జుబేదా అతని అర్ధంకాని సమస్య అయింది. అర్ధం కాని సమస్యగానే ఆమె జీవితంముగిసింది.

ముఖేష్ సాయంతో లేచి నిలబడుతుండగా జేబులోని గులాబీలు గుర్తుకువచ్చాయి.

ఆరెంటినీ జుబేదామీద వదిలి మెట్లు దిగాడు.

***

"సి.ఐ.బి.కి మీకు రిక్విజిషన్ పంపగానే నేనుముందు బయలుదేరాను. నావెనుక ముఖేష్, శ్రీకర్ లు వచ్చారు. సలీమాలో ప్రయాణించేముందువారిని హెచ్చరించి నేను సముద్రప్రయాణం ప్రారంభించాను. ఆనాటినుంచీ అరేబియన్ సీమీదుగా భారతదేశం వచ్చేనౌకలన్నిటినీ కనిపెట్టుకొని వున్నారు.

నేను విక్టర్ ని కార్నర్ చేయటానికి ప్రయత్నిస్తుండగా వారిద్దరూ అతని అనుచరులను కవర్ చేశారు. సి.ఐ.డి.

బృందం మెహరున్నీసాను స్వాధీనపరచుకోగానే పురానా బస్తీ వచ్చారిద్దరూ.స్మోక్ బాంబులతో షిక్కాను, అతని అనుచరులనుబెదిరించి బంధించారు. ఆఖరిక్షణంలో వారి ప్రవేశం నా ప్రాణాలు రక్షించింది"

జరిగింది ఫెర్నాండజ్ కి వివరించాడు షాడో.

"వెల్ రాజూ! ఒకానొకనాటి షాడో... యింతవాడవుతాడని నేను అనుకోలేదు. గుడ్ బై మైఫ్రండ్!" అంటూ కరచాలనం చేశాడు ఫెర్నాండజ్.

ముఖేష్, శ్రీకర్ లు అనుసరిస్తుండగా విమానాశ్రయం వైపు అడుగులు వేశాడు షాడో .దికిల్లర్ ఫ్రం సి.ఐ.బి.

--:జైహింద్:--

# The Killer From CIB

